# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 86 | శనివారం 29, నవంబర్ 2025 | పేజీలు: 08 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com





## కామారెడ్డిలో కవిత రైల్ రోకో

**బీసీ రిజర్వేషన్లపెంపుపై కామారెడ్డి రైల్వేస్టేషన్ లో రైల్ రోకో**
**పట్టాలపై బైఠాయించిన కవిత, జాగృతి నేతలు**
**పోలీసులకు, జాగృతి నేతల మధ్య తోపులాట**
**కవిత చేతికి స్వల్పగాయం**
**అరెస్టు.. దేవనపల్లి పోలీసు స్టేషన్ కు తరలింపు**
**బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి**
**బీసీలకు ఇవ్వాల్సిన రిజర్వేషన్లు ఇవ్వాలి**
**రైల్ రోకో చేసి ఢిల్లీ వరకు మెసేజ్ పంపిస్తున్నాం**
**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత**

**కామారెడ్డి, (ప్రజాస్వరం):**

బీసీ రిజర్వేషన్ల పెంపును డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి శుక్రవారం నిర్వహించిన రైల్‌రోకోలో కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిసరాలు ఉద్రిక్తంగా మారాయి. జాగృతి కార్యకర్తలు, పోలీసులు పరస్పరం తోపులాటకు దిగటంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు

..మిగతా 2లో



## నయా భారత్ బెదిరింపులకు లొంగదు

**సుదర్శన్ చక్రం మన ఆయుధం**
**మొత్తం ప్రపంచం భారత్ వైపే చూస్తోంది**
**దేశ పౌరుల రక్షణే మన దేశానికి ముఖ్యం**
**పాత భారత్ ను మరిచిపోండి..**
**ఇప్పుడున్నది నయా భారత్**
**ఉడుపిలో శ్రీకృష్ణ మఠంలో**
**ప్రధాని మోదీ వ్యాఖ్యలు**
**మోడీని భారత భాగ్య**
**విధాత అంటూ పొగిడిన మఠాధిపతి**
**భారీ జనసందోహం**
**మధ్య భగవద్గీతా పారాయణ కార్యక్రమం**

**కర్ణాటక, (ప్రజాస్వరం):**

కర్ణాటకలోని ప్రసిద్ధ ఉడుపి శ్రీకృష్ణ మఠాన్ని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందర్శించారు. లక్షమంది భక్తులతో కూడిన భారీ భగవద్గీతా లక్షకంఠ పారాయణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, శ్రీకృష్ణుని సుదర్శన చక్రం లాంటి దేశ భద్రతా వ్యవస్థను నిర్మిస్తామని మరోసారి స్పష్టం చేశారు. "నయా భారత్ ఎవరి ముందు తలవంచదు, పౌరుల రక్షణ కోసం ఎంత దూరమైనా

..మిగతా 2లో

## అంతటి బలహీనమైన నాయకుడిని కాదు

**ఓడిపోయినంత మాత్రాన**
**చిన్నబుచ్చుకునే వ్యక్తిని కాదని వ్యాఖ్య**
**బీజేపీ ఎంపీ లక్ష్మణ్**
**రాహుల్ గాంధీ గురించి**
**మాట్లాడటం సరికాదన్న జగ్గారెడ్డి**


03




## పంచాయతీ ఎన్నికలకు లైన్‌క్లియర్

**రిజర్వేషన్లపై ప్రభుత్వానికి నోటీసులు**
**8 వారాల తర్వాత తదుపరి విచారణ**
**ఎన్నికలను ఆపడం కుదరదన్న కోర్టు**
**పిటిషనర్ల అభ్యంతరాల పరిశీలన**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు హైకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన హైకోర్టు, ఈ దశలో స్టే విధించడం సాధ్యంకాదని స్పష్టం చేసింది. రిజర్వేషన్ విధానం పట్ల పిటిషనర్ల అభ్యంతరాలను పరిశీలిస్తున్నప్పటికీ, ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో కోర్టు

..మిగతా 2లో

## ఆయుధాలు విడిచి లొంగిపోతాం

**మావోయిస్టుల సంచలన ప్రకటన**
**జనవరి 1న సాయుధ పోరాటాన్ని**
**విరమిస్తామన్న మావోయిస్టులు**
**అప్పటివరకు కాల్పుల విరమణ ఆపండి**
**మావోయిస్టు ఉద్యమంలో కీలక పరిణామం**


03

## స్కీంలు లేవుగానీ.. ఎందులో చూసినా స్కాంలు..!

**పురుగులన్నం ఘటనపై**
**హరీష్ రావు ఆగ్రహం**
**సమీక్షలు చేస్తానన్న**
**మాటలు ఎక్కడ.?**
**బడిపిల్లలను**
**రోడ్డెక్కించే పరిస్థితులు**
**ఎందుకు వచ్చాయి?**
**అసిఫాబాద్ ఘటనపై**
**వెంటనే చర్యలు**
**తీసుకోవాలి : హరీష్ రావు**


02

## కేసీఆర్ దీక్ష ఒక నాటకం

**సెంటిమెంట్‌ను రాజేసే కుట్ర**
**తెలంగాణను కేసీఆర్**
**ఫ్యామిలీ దోచుకున్నది**
**కాంగ్రెస్ వల్లే తెలంగాణ**
**రాష్ట్రం సిద్ధించింది**
**పీసీసీ చీఫ్**
**మహేశ్ కుమార్ గౌడ్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కాంగ్రెస్ పార్టీ పాత్రను ప్రజలకు మరచిపోయేలా చేయడానికి కేసీఆర్ మరోసారి సెంటిమెంట్ రాజకీయాలను రంగంలోకి దింపుతున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, తెలంగాణ సెంటిమెంట్‌ను కేసీఆర్ కుటుంబం పదేళ్ల పాటు ప్రయోజనాల కోసం వాడుకున్నదానికే 'దీక్షా దివస్' వంటి

..మిగతా 2లో



03

## ఇందిరమ్మ క్యాంటీన్లకు ప్రభుత్వం వేగం

**రూ.5కే నాణ్యమైన భోజనం**
**బాగ్ లింగంపల్లిలో కొత్త**
**క్యాంటీన్ ప్రారంభం**
**GHMC కొత్త లొకేషన్ల**
**మ్యాపింగ్ సిద్ధం**

## హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ఆధునీకరణ.!

**హైటెక్ రైల్వే స్టేషన్**
**అప్‌గ్రేడ్ వేగం**
**తెలంగాణలో**
**40 స్టేషన్ల అభివృద్ధి**
**ప్రయాణికులకు**
**కొత్త సౌకర్యాలు**
**ఫస్ట్ ఫేజ్ త్వరలో పూర్తి**


03

## నేడు దీక్షాదివస్

**రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు**
**రక్తదాన శిబిరాలు, దీక్షకు సంబంధించిన డాక్యుమెంటరీల ప్రదర్శన**
**కళాశాలు, యూనివర్సిటీల్లో నిర్వహణకు ఏర్పాట్లు**


02

# పంచాయతీ ఎన్నికలకు లైన్‌క్లియర్

**మొదటిపేజీ తరువాయి**

ఈ నిర్ణయం తీసుకుంది.

**జీవో 46పై అభ్యంతరం**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపుకు సంబంధించి జీవో 46ని జారీ చేసింది. ఈ జీవోలో అత్యంత వెనుకబడిన కులాలకు (మోస్ట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్) తగిన ప్రాతినిధ్యం కల్పించలేదని పిటిషనర్లు ఆరోపించారు. బీసీ ఏ-బీ-సీ-డి వర్గాల ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించాలని, ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కులాలకు ప్రత్యేక స్థానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జీవోను రద్దు చేసి, ఎన్నికల ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది.

**ఇప్పుడే స్టే సాధ్యం కాదు**

పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, పలు ముఖ్య వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఇప్పటికే విడుదలై ప్రక్రియ ప్రారంభమైంది. ఈ దశలో స్టే విధిస్తే మొత్తం వ్యవస్థ తారుమారవుతుందన్న ఉద్దేశంతో స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత చాలా కాలం గడిచాకే పిటిషన్‌ను ఎందుకు దాఖలు చేశారో కోర్టు పిటిషనర్లను ప్రశ్నించింది. రిజర్వేషన్ కేటాయింపులపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఆధారాలు ఏవో వివరిస్తూ **కౌంటర్ అఫిడవిట్‌ను ప్రభుత్వంనుండి దాఖలు చేయించాలని ఆదేశించింది.

**ప్రభుత్వంపై కోర్టు సూచనలు**

కోర్టు ప్రభుత్వం రిజర్వేషన్ల కేటాయింపులో ఉపయోగించిన డేటా, వర్గీకరణ ప్రమాణాలు, గత ఎన్నికల గణాంకాలు వంటి వివరాలను సమగ్రంగా సమర్పించాలని ఆదేశించింది. రిజర్వేషన్ వ్యవస్థ న్యాయపరంగా సముచితమా? సామాజిక న్యాయానికి అనుగుణంగా ఉందా? అనే అంశాలను విచారణలో పరిశీలించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కేసు తదుపరి విచారణను హైకోర్టు 8 వారాలకు వాయిదా వేసింది. అప్పటివరకు ప్రభుత్వం సమగ్ర వివరణాత్మక కౌంటర్ ఫైలింగ్ పూర్తి చేయాలని సూచించింది.

**ఎన్నికల ప్రక్రియకు అడ్డంకి లేదు**

హైకోర్టు తాజా నిర్ణయంతో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు కొనసాగడానికి మార్గం సుగమమైంది. రిజర్వేషన్ విధానం విషయంలో కోర్టు తుది తీర్పు వచ్చే వరకు, ఎన్నికల నిర్వహణపై ఎలాంటి ప్రభావం ఉండదని న్యాయవర్గాలు చెబుతున్నాయి. పిటిషనర్ల డిమాండ్లు, ప్రభుత్వ వివరణలు, హైకోర్టు తుది తీర్పు మూడు అంశాలు కలిపి రాబోయే వారాల్లో రాష్ట్ర రాజకీయంగా, పరిపాలనా స్థాయిలో ముఖ్యం కానున్నాయి.




# కేసీఆర్ చేసిన దీక్ష ఒక నాటకం

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమాలు నిదర్శనమని అన్నారు.

కేసీఆర్ గతంలో చేసిన దీక్ష అసలు ప్రజల కోసమై కాదు, రాజకీయ నాటకమేనని మహేశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. "తెలంగాణ కోసం చేశానన్న కేసీఆర్ దీక్ష మూడు రోజులు కూడా నిలబడలేదు. విద్యార్థి సంఘాలు, ఉద్యమకారుల ఒత్తిడి పెరగడంతో దీక్షను మధ్యలోనే ముగించి తిరోగమనమయ్యారు. దీన్ని ఉద్యమంగా ఎలా చెప్పగలరు?" అని ప్రశ్నించారు. కేసీఆర్ దీక్షను పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగ దీక్షతో పోల్చడం సరికాదని, ఆ ఇద్దరి లక్ష్యం, త్యాగం, ధ్యేయం మధ్య ఎంతో వ్యత్యాసం ఉందని స్పష్టం చేశారు.



తెలంగాణ కోసం నిజంగా పోరాడింది కాంగ్రెస్ పార్టీనేనని, దశాబ్దాల కలను నిజం చేసిన నేత సోనియా గాంధీయేనని మహేశ్‌కుమార్ తెలిపారు. "విద్యార్థులు, నిరుద్యోగులు, పేదలు, ఎస్సీ-ఎస్టీ యువతులు ఉద్యమంలో రక్తం చిందించారు. వారి త్యాగాల వల్లే తెలంగాణ వచ్చింది. కానీ రాష్ట్రం ఏర్పడిన తరువాత కేసీఆర్ కుటుంబం ఆ త్యాగాలను మరిచి పదేళ్లు ప్రజలను దోచుకుంది'' అని మండిపడ్డారు.

తెలంగాణ ప్రజలు మళ్లీ సెంటిమెంట్ మాటలు, మాయాజాలాలకు లోనుకాకుండా, వాస్తవాలు, చరిత్ర తెలుసుకుని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం కాంగ్రెస్ పార్టీ సంకల్పం, సోనియా గాంధీ నిర్ణయమే తెలంగాణ రాష్ట్రాన్ని సాధ్యంచేసిందని మరోసారి పునరుద్ఘాటించారు.

## మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల సాధనకు కృషి చేయాలి

- **శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్**

**శంకరపల్లి నవంబర్ 28(ప్రజాస్వరం):**



సామాజిక విప్లవకారుడు మరియు సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతి రావు పూలే వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం శంకర్ పల్లి చౌరస్తాలో వారికి ఘన నివాళులు అర్పించారు. భారత దేశం గర్వపడే మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ తప్పక పాటించాలని శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నాడు మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శంకర్ పల్లి లోని ఆయన శిలా విగ్రహానికి నరేష్ కుమార్ మరియు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే ఆదర్శాలను ప్రతి దేశభక్తుడు ఆచరించాలని పిలుపునిచ్చారు. ఆయన ధైర్యసాహసాలు, మంచితనం, క్రమశిక్షణ వంటి సుగుణాలను నేటి యువతరం ఆచరించాలని, తద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండిత్ రావు, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో కవిత రైల్ రోకో

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగాయి. పట్టాలపై బైఠాయించిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అడ్డుకునే క్రమంలో ఆమెకి చేతికేసి స్వల్ప గాయం అయినట్లు తెలిసింది.

**పట్టాలపై బైఠాయించిన కవిత**

జాగృతి కార్యకర్తలు భారీ సంఖ్యలో రైలు పట్టాల వద్ద చేరడంతో పరిస్థితి క్షణక్షణం కఠినతరం అయ్యింది. నిరసనను నియంత్రించేందుకు పోలీసులు ముందుకు రావడంతో తోపులాట చోటుచేసుకుంది. తీవ్ర ఉద్వేగంతో నినాదాలు చేసిన కార్యకర్తలను వెనక్కు నెట్టి పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. దీంతో కొంతసేపు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి.

**కాళేశ్వరం వల్ల కామారెడ్డికి నీళ్లు రాలేదు**

రైల్‌రోకోకు ముందు మీడియాతో మాట్లాడిన కవిత, కాళేశ్వరం ప్రాజెక్టుపై తీవ్ర విమర్శలు చేశారు. "కాళేశ్వరం ద్వారా కామారెడ్డికి ఒక్క ఎకరాకూ నీళ్లు రాలేదు. ప్యాకేజీలు 21, 22 పేరుతో వందల కోట్లు కాంట్రాక్టర్లకే వెళ్లిపోయాయి. ప్రజలకు లాభం ఏమీ జరగలేదు."** అని ఆక్షేపించారు.

**నాపై కుట్ర చేసి కుటుంబం నుంచి దూరం చేశారు**

ప్రాజెక్టుల అవినీతి గురించి మాట్లాడితే మాజీ పాలకపక్షంలోని కొందరు నేతలు అసహనం వ్యక్తం చేస్తారని కవిత అన్నారు. నిజం చెబితే నాపై నోరు వేసుకొని పడిపోతారు. నన్ను కుట్ర చేసి కుటుంబం నుంచి దూరం చేశారు. అని ఆమె వ్యాఖ్యానించారు.

**బీసీలపై తొలి ద్రోహి బీజేపీ**

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం రెండూ మోసం చేశాయని ఆమె ఆరోపించారు. మొదటి ద్రోహి భాజపా... రెండో ద్రోహి కాంగ్రెస్. బీసీల హక్కులను ఇద్దరూ అణగదొక్కుతున్నారు." అని కవిత మండిపడ్డారు. రైల్‌రోకో కారణంగా కొంతసేపు రవాణా అంతరాయం ఏర్పడింది. పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులు అదనపు బలగాలను మోహరించారు. ప్రస్తుతం పరిస్థితి స్థిరంగా ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి.





# నయా భారత్ బెదిరింపులకు లొంగదు

**మొదటిపేజీ తరువాయి**

వెళ్తుంది" అని ధైర్యంగా ప్రకటించారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఇచ్చిన బోధనలు ప్రతి యుగానికి వర్తిస్తాయని, అవే భారత జాతీయ విధానాలకు మార్గదర్శకాలని గుర్తు చేశారు. "ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేయాలని కృష్ణుడు బోధించాడు. 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్' అనే నినాదాలు గీతా స్ఫూర్తితోనే రూపొందాయి. మహిళల రక్షణపై శ్రీకృష్ణుడు ఇచ్చిన సందేశమే లోక్‌సభలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుకు మార్గదర్శకమైంది. శాంతి, సత్యం కోసం అవసరమైతే దురాగతాలకు పాల్పడే శక్తులను అణచివేయాలని గీత మనకు నేర్పుతుంది" అని మోదీ వివరించారు.

**"పాత భారత్‌ను మరచిపోండి – నయా భారత్ ఇది!"**

దేశ భద్రతపై ప్రధాని మోదీ చేసిన ప్రస్తావన హైలైట్‌గా నిలిచింది. "గతంలో ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు అప్పటి ప్రభుత్వాలు ఏమీ చేయకుండా చూస్తూ ఊరుకునేవి. దాడి జరిగిన చోట దండలు కొట్టుకుని, దోషులపై దోసియేలు ఏర్పాటు చేసి ఊరుకునేవారు. కానీ నేటి నయా భారత్ అలా కాదు. ఇక ఎవరి ముందు తల వంచము. ఎవరికీ భయపడము. దేశ రక్షణలో ఎన్నటికీ వెనకడుగు వేయము. ఆపరేషన్ సిందూర్‌లో మన సైనిక సంకల్పాన్ని ప్రపంచం చూసింది. మన 'మిషన్ సుదర్శన చక్ర' శత్రువులను ఎక్కడ ఉన్నా వెంటాడి నాశనం చేస్తుంది. శ్రీకృష్ణుని సుదర్శన చక్రం లాగానే... దేశ పౌరులకు పూర్తి భద్రతా కవచాన్ని రానున్న పదేళ్లలో రూ.లక్షల కోట్ల పెట్టుబడితో సాంకేతిక ఆధారిత వ్యవస్థల ద్వారా ఏర్పాటు చేస్తాం" అని ప్రధాని ధీమా వ్యాఖ్యానించారు.




**"భారత భాగ్య విధాత" బిరుదు**

ఉడుపికి చేరుకున్న ప్రధానికి భారీ రోడ్‌షోలో లక్షలాది ప్రజలు స్వాగతం పలికారు. శ్రీకృష్ణ మఠంలో పుతిగే మఠాధిపతి శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామి ఆధ్వర్యంలో అష్ట మఠాధిపతులు ఘనంగా ఆహ్వానించారు. ప్రసిద్ధ కనకన కిండి (కిటికీ) నుంచి శ్రీకృష్ణుడి మూల విరాట్ దర్శనం చేసుకున్న మోదీ, లక్ష కంఠ గీతా పారాయణంలో పాల్గొని 10 శ్లోకాలను స్వయంగా పఠించారు. మఠాధిపతి శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామి ప్రధానిని "ఈ యుగపు అర్జునుడు" అంటూ కొనియాడారు. దేశ సేవలకు గుర్తింపుగా "భారత భాగ్య విధాత" అనే గౌరవ బిరుదును సన్మానంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు, కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా భద్రత, అభివృద్ధి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణలో మోదీ ప్రభుత్వం తీవ్ర సంకల్పంతో ముందుకు దూసుకెళ్తోందన్న సందేశం ఈ ఉడుపి పర్యటన ద్వారా మరింత బలంగా వినిపించింది.

# స్కీంలు లేవుగానీ.. ఎందులో చూసినా స్కాంలు..!

- **పురుగులన్నం ఘటనపై హరీష్ రావు ఆగ్రహం**
- **సమీక్షలు చేస్తానన్న మాటలు ఎక్కడ.?**
- **బడిపిల్లలను రోడ్డెక్కించే పరిస్థితులు ఎందుకు వచ్చాయి?**
- **అసిఫాబాద్ ఘటనపై వెంటనే చర్యలు తీసుకోవాలి : హరీష్ రావు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**



మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పుకుంటూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కూడా నాణ్యమైన ఆహారం అందించలేని పరిస్థితి నెలకొన్నదని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పురుగులతో కూడిన అన్నం అందించిన ఘటనను గుర్తుచేస్తూ, "ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు పురుగులు లేని అన్నం పెట్టండి" అని సీఎం రేవంత్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. సీఎంగా, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఎన్నిసార్లు సమీక్షలు జరిపారో, విద్యార్థులకు కల్తీ ఆహారం పెడుతున్న వారిపై ఇప్పటిదాకా ఎన్ని చర్యలు తీసుకున్నారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "కల్తీ ఆహారం పెడితే జైలుకు పంపిస్తామని అన్న మాటలు ఎక్కడికి పోయాయి? మీ మాటలకు విలువ లేదు, ఆచరణలో దిక్కులేదు" అని హరీష్ రావు విమర్శించారు. పాఠశాలల్లో ఆహార నాణ్యతపై ఆందోళన వ్యక్తం చేస్తూ, బడిలో చదువుకోవాల్సిన విద్యార్థులే రోడ్ల మీదకు వచ్చి "పురుగులన్నం మాకు వద్దు" అని నిలదీస్తుంటే ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. రెండు సంవత్సరాలుగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం స్కాంలతోనే నిండిపోయిందని, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టలేదని హరీష్ రావు ఆరోపించారు. కొమరం భీం ఆసిఫాబాద్ ఘటనపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని హరీష్ రావు డిమాండ్ చేశారు..

# నేడు దీక్షాదివస్

- **రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు**
- **రక్తదానశిబిరాలు, దీక్షకు సంబంధించిన డాక్యుమెంటరీల ప్రదర్శన**
- **కళాశాలు, యూనివర్సిటీల్లో నిర్వహణకు ఏర్పాట్లు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**




ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆమరణ దీక్ష చేసిన విషయం తెలిసిందే. ఆ దీక్ష రోజూ బీఆర్ఎస్ ప్రతి ఏటా దీక్షా దివస్ పేరిట నిర్వహిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం అన్ని జిల్లాల్లో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది. పార్టీ ఆదేశాల మేరకు పార్టీ నేతలు ఏర్పాట్లు చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయాలతో పాటు తెలంగాణ భవన్ లోనూ దీక్ష దివాస్ ఫొటో ఎగ్జిబిషన్, బుక్ ప్రదర్శన, తెలంగాణ ఉద్యమం చరిత్ర, దీక్ష వివరాలను ఎల్ ఈడీ స్క్రీన్ లతో డాక్యుమెంటరీలను ప్రదర్శించనున్నారు. రాష్ట్ర సాధన కోసం ఆనాడు కేసీఆర్ చేసిన త్యాగాన్ని, ఆనాటి పరిస్థితులను కళ్లకుకట్టినట్టు చూపించారు. ఆనాడు ఉన్న ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలను తెలంగాణ వాదులను ఎలా కట్టడి చేశాయి? ఎలా అడ్డుకున్నాయి? అయినా రాష్ట్ర కాంక్షతో వాటన్నింటిని దాటుకుని కేసీఆర్ ఎలా ఉద్యమాన్ని ముందుకు నడిపించారు.? తన ప్రాణాన్ని సైతం ఎలా పణంగా పెట్టారనే విషయాలను వీడియోల రూపంలో చూపనున్నారు. అదే విధంగా అమరవీరుల స్థూపానికి నివాళి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం, ఉద్యమకారులకు సన్మానం చేయనున్నారు. అనంతరం ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు, నేతల అభిప్రాయాలను వివరించనున్నారు. ఇప్పటికే దీక్షాదివస్ కు చెందిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అదే విధంగా రక్తదానశిబిరాలను సైతం నిర్వహించనున్నారు. బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో కళాశాలలు, యూనివర్సిటీల్లోనూ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భవన్ లో జరిగే దిక్షాదివాస్ లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సిద్దిపేటలో మాజీ మంత్రి హరీష్ రావు పాల్గొనున్నారు.

**నేటికి దిక్షాదివస్ కు 15 ఏళ్లుకంప్లీట్**

2009, నవంబరు 29న కరీంనగర్ లోని ఉత్తర తెలంగాణ భవన్ నుంచి సిద్ధిపేట దగ్గర రంగధాంపల్లిలో ఏర్పాటుచేసిన దీక్షా స్థలం వద్దకి బయల్దేరిన కేసీఆర్ వాహనంను కరీంనగర్ మానేరు బ్రిడ్జ్ సమీపంలోని అలుగునూరు చౌరస్తాలో పోలీసు బలగాలు, రిజర్వ్ పోలీస్ బెటాలియన్లు చుట్టుముట్టారు. వాహనం నుంచి బలవంతంగా దించివేయబడ్డ కేసీఆర్, రోడ్డుమీదే ధర్నా చేస్తుండడంతో ఖమ్మం జైలుకు తరలించారు. ఆ జైలులోనే తన దీక్షను ప్రారంభించాడు. డిసెంబరు 1న 'నేను లేకున్నా ఉద్యమం నడవాలి' అని కేసీఆర్ ప్రకటించాడు. డిసెంబరు 2న పార్లమెంట్ లో అద్వానీ ఈ దీక్షను ప్రస్తావించారు. ఆరోగ్యం క్షీణించడంతో డిసెంబరు 3న కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. 'తెలంగాణ వస్తే జైత్రయాత్ర, లేకుంటే నా శవయాత్ర' అని నిమ్స్ నుంచే కేసీఆర్ ప్రకటించాడు. 4న రక్తంలో పొటాషియం, సోడియం తగ్గడంతో కేసీఆర్‌ను అత్యవసర వైద్య విభాగానికి తరలించారు. కోమాలోకి పోయే ప్రమాదం ఉన్నదని వైద్యులు హెచ్చరించారు. ప్రజలు మెచ్చే ప్రకటన చేసే వరకు తన దీక్ష, తెలంగాణ ప్రజల ఆందోళనలు కొనసాగుతాయని ప్రకటించాడు. 5న వెంకటస్వామి, చిరంజీవి, చంద్రబాబు నాయుడు, కాంగ్రెస్ ఎంపీలు కలిసి దీక్ష విరమించాలని కోరినా నిరాకరించాడు. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పెడితేనే విరమిస్తానని చెప్పాడు. దాంతో రాష్ట్ర రాజధాని ఫ్రీజోన్ కాదని అసెంబ్లీలో తీర్మానం పెడతామని, కేసీఆర్‌పై కేసులు ఎత్తివేస్తామని ప్రభుత్వం ప్రకటించింది .6న అసెంబ్లీలో 14ఎఫ్‌ను రద్దు చేస్తూ తీర్మానం చేశారు. కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తోందన్న సమాచారంతో తెలంగాణలోని పలుచోట్ల నిరసనలు వెల్లువెత్తాయి, బంద్ లు జరిగాయి. ఎటు చూసినా జై తెలంగాణ నినాదమే వినిపించింది. వరుస బంద్ లతో బస్సులు, రైళ్లు స్తంభించిపోయాయి. లాయర్లు, ఇంజినీర్లు, మేధావులు, రాజకీయ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇలా నాలుగున్నర కోట్లమంది ఒక్కటయ్యారు. డిసెంబరు 7న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో అన్నిపార్టీలు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు మద్దతు ప్రకటించాయి. డిసెంబరు 8న కేసీఆర్ ఆరోగ్యం ప్రమాదకరంగా ఉన్నదని, ప్రొటీన్లు, అల్బుమిన్లు లోపించాయని, ఇక తమ చేతుల్లో ఏమీలేదని వైద్యులు తెలిపారు. తెలంగాణ దిశగా సోనియాగాంధీ నిర్ణయం తీసుకున్నారు. దాంతో డిసెంబరు 9న కాంగ్రెస్ కోర్ కమిటీ ఐదుసార్లు సమావేశమైంది. సమావేశం నుంచి చిదంబరం బయటికి వచ్చి ఫోన్‌లో కేసీఆర్, జయశంకర్‌సార్‌తో సంభాషించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటనపై సమాలోచనలు జరిగాయి. రాష్ట్ర ఏర్పాటు ప్రకటన విషయంలో స్పష్టమైన పదజాలం ఉండాల్సిందేనని చిదంబరానికి స్పష్టంచేశారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తున్నట్లుగా ప్రకటన చేయాలన్న సోనియా సూచన మేరకు కేంద్ర హోంమంత్రి హోదాలో చిదంబరం మాట్లాడుతూ... అనేక పరిణామాల అనంతరం ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని, wవిద్యార్థులు, ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని ప్రకటన చేశారు. ప్రకటన అనంతరం నిమ్స్ నుంచి 'ఇది తెలంగాణ ప్రజల విజయం' అని కేసీఆర్ ప్రకటించాడు. 11 రోజుల సుదీర్ఘ దీక్షతో తెలంగాణకు ఏకంచేసిన కేసీఆర్ తెలంగాణ ఏర్పాటు ప్రకటన తరువాత తన ఆమరణ దీక్షను విరమించాడు. దీక్షా దివాస్ కు శనివారంతో 15 ఏళ్లు కంప్లీట్ అయ్యాయి.

## అంతటి బలహీనమైన
# నాయకుడిని కాదు

- ఓడిపోయినంత మాత్రాన చిన్నబుచ్చుకునే వ్యక్తిని కాదని వ్యాఖ్య
- బీజేపీ ఎంపీ లక్ష్మణ్ రాహుల్ గాంధీ గురించి మాట్లాడటం సరికాదన్న జగ్గారెడ్డి
- దేశంలో కాంగ్రెస్ ఎంతో అభివృద్ధి చేసిందన్న జగ్గారెడ్డి



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైనంత మాత్రాన తాను కుంగిపోయే వ్యక్తిని కాదని, అంత బలహీనమైన నాయకుడిని కాదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాల్లో అన్ని ప్రశ్నలకు ఒకేసారి సమాధానం ఉండదని ఆయన ఈరోజు మీడియాతో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించడం సరికాదని ఆయన అన్నారు. లక్ష్మణ్ వయస్సు 69 ఏళ్లని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అవుతోందని, అప్పటికింకా లక్ష్మణ్ పుట్టలేదని అన్నారు. అలాంటి లక్ష్మణ్ తమ పార్టీ నాయకుడి గురించి మాట్లాడటం సముచితం కాదని అన్నారు.దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయాన్ని అభివృద్ధి చేశామని, ఎఫ్‌సీఐని ఏర్పాటు చేశామని, పెత్తందారీ భూములను పేదలకు పంచామని, బ్యాంకులను పల్లెలకు తెచ్చామని, బాలానగర్ బీడీఎల్ వంటి కంపెనీలు తెచ్చామని ఆయన అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చి 12 ఏళ్లు అవుతోందని, వారు ఏం కంపెనీలు ప్రారంభించారో చెప్పాలని నిలదీశారు. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించింది రాజీవ్ గాంధీ అని ఆయన గుర్తు చేశారు. దేశంలో ఐటీ అభివృద్ధికి రాజీవ్ గాంధీ ఆలోచనలే కారణమని అన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఉన్న అభివృద్ధి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉందా అని ప్రశ్నించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ దొంగ ఓట్లతో గెలుస్తూ వస్తోందని విమర్శించారు.

# ఆయుధాలు విడిచి లొంగిపోతాం

- మావోయిస్టుల సంచలన ప్రకటన
- జనవరి 1న సాయుధ పోరాటాన్ని విరమిస్తామన్న మావోయిస్టులు
- అప్పటివరకు కాల్పుల విరమణ ఆపండి
- మావోయిస్టు ఉద్యమంలో కీలక పరిణామం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మావోయిస్టు ఉద్యమంలో భారీ మార్పులకు సంకేతాలిస్తున్న కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. ఎంఎంసీ (మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-ఛత్తీస్‌గఢ్) జోన్ ప్రతినిధి అనంత్ పేరుతో మావోయిస్టులు విడుదల చేసిన తాజా లేఖ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ లేఖలో వచ్చే ఏడాది జనవరి 1న సాయుధ పోరాటాన్ని పూర్తిగా విరమించుకుని, ఆయుధాలను ప్రభుత్వానికి అప్పగించి లొంగిపోతామని స్పష్టం చేశారు.

**ఒక్కొక్కరుగా కాదు...**

**ఒకేసారి లొంగుబాటు**

అనంత్ విడుదల చేసిన లేఖలో, గతంలో లాగా విడివిడిగా కాకుండా, ఈసారి సమూహంగా, ఒకేసారి లొంగిపోవడానికి నిర్ణయించుకున్నామని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా మావోయిస్టు దళాలకు ఎదురైన భారీ నష్టాలు, నాయకత్వంలో చోటుచేసుకున్న మార్పులు ఈ నిర్ణయానికి కారణమైనట్లు తెలిపారు. అగ్రనేతలు మల్లోజుల, ఆశన్న వంటి కీలక నాయకుల లొంగుబాటు, అలాగే ప్రముఖ కమాండర్ హిడ్మా ఇటీవల ఎన్‌కౌంటర్‌లో హతమైన నేపథ్యంలో, సంస్థ తీవ్ర బలహీనతకు గురైందని లేఖలో అంగీకరించారు. ఈ పరిణామాలు ఉద్యమం కొనసాగించే దిశగా మావోయిస్టులకు సవాలుగా మారడంతో, పోరాటాన్ని ముగించాలనే ఆలోచన పున్నమయ్యిందని పేర్కొన్నారు.

**కేంద్ర విజ్ఞప్తి ప్రభావం**

నేలమన్నిన ప్రాంతాల్లో శాంతి నెలకొల్పడం, అరణ్య ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు అనుకూల వాతావరణం సృష్టించడం కోసం కేంద్ర ప్రభుత్వం పలుమార్లు మావోయిస్టులకు లొంగుబాటు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పునరావాస హామీలను నమ్మి ఆయుధాలు వదిలేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు.

**పునరావాసానికి అంగీకారం**

లొంగుబాటు తర్వాత ప్రభుత్వ పునరావాస కార్యక్రమాల్లో పూర్తిగా భాగస్వామ్యం కావడానికి సిద్ధమని మావోయిస్టులు లేఖలో వెల్లడించారు. "తమకు సహకరించే ఏ రాష్ట్రంలోనైనా సరే లొంగిపోవడానికి సిద్ధంగా ఉన్నాం" అని పేర్కొంటూ, మిగిలిన వారంతా లొంగిపోవడం పూర్తయ్యే వరకు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలు సంయమనం పాటించాలని కోరారు.

**గతవారం సంకేతం... ఇప్పుడు స్పష్టత**

జనజీవన స్రవంతిలో కలిసేందుకు సమయం కావాలని గతవారం మావోయిస్టులు లేఖ రాయడం ఇప్పుడు ఈ తాజా ప్రకటనకు పునాది వేసినట్లైంది. ఆ లేఖలో ఉద్యమ దిశపై కీలక మార్పులు సూచించగా, ఈసారి ఆ నిర్ణయాన్ని స్పష్టంగా ప్రకటించారు. ఎంఎంసీ జోన్‌లో ఎన్నేళ్లుగానో కొనసాగుతున్న సాయుధ పోరాటం ముగింపు దశకు చేరుతున్న నేపథ్యంలో, అడవులు, గిరిజన ప్రాంతాల్లో శాంతి, భద్రత, అభివృద్ధి పనులకు అవకాశం పెరగనుంది. అధికార వర్గాలు ఈ ప్రకటనను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి.



# హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ ఆధునీకరణ..!

- హైటెక్ రైల్వే స్టేషన్ అప్‌గ్రేడ్ వేగం
- తెలంగాణలో 40 స్టేషన్ల అభివృద్ధి
- ప్రయాణికులకు కొత్త సౌకర్యాలు
- ఫస్ట్ ఫేజ్ త్వరలో పూర్తి

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను ఆధునికీకరించే పనులను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీం కింద ఈ స్టేషన్ అభివృద్ధి వేగవంతంగా కొనసాగుతుండగా, మొత్తం 35 కోట్ల రూపాయలతో అత్యాధునిక సౌకర్యాలను కల్పించే పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. సాంకేతిక ప్రగతికి కేంద్ర బిందువుగా ఉన్న హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు, రోజువారీ ప్రయాణికులు, టూరిజం రంగానికి చెందిన వారు ఉపయోగించే ఈ స్టేషన్‌ను ఆధునిక ప్రమాణాలతో తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పదవిలోకి వచ్చిన తర్వాత తెలంగాణలో రైల్వే అభివృద్ధి ఎన్నడూ లేనంత వేగంగా సాగుతోందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. రైల్వే లైన్ల నిర్మాణం నుంచి స్టేషన్ల ఆధునీకరణ వరకు రాష్ట్రంలో ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల పునరుద్ధరణ జరుగుతుండటం ఇదే మొదటి సారేనని చెప్పారు. ఇటీవలే చర్లపల్లి న్యూ టర్మినల్‌ను ప్రధాని ప్రారంభించగా, హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి టర్మినల్స్‌కు తోడుగా ఇది నాలుగో ప్రధాన టర్మినల్‌గా సేవలు అందిస్తోంది.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను 720 కోట్లతో, కాచిగూడ స్టేషన్‌ను 424 కోట్లతో ఆధునీకరించే పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇదే క్రమంలో హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో ఫస్ట్ ఫేజ్‌గా 26 కోట్లతో కొత్త భవనాలు, అప్రోచ్ రోడ్లు, ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని, రెండో దశలో మరో 10 కోట్లతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం రోజుకు 62 సబర్బన్, ఎంఎంటీఎస్ రైళ్లు ఈ స్టేషన్ వద్ద ఆగుతుండగా, సుమారు 5,400 మంది ప్రయాణికులు సేవలు పొందుతున్నారని తెలిపారు. ఆధునీకరణ అనంతరం ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

స్టేషన్‌లో నాలుగు లిఫ్టులు, రెండు ఎస్కలేటర్లు, ఆధునిక వెయిటింగ్ రూమ్స్, దివ్యాంగులకు అనుకూలంగా ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఈ పనులన్నీ వచ్చే సంవత్సరం ఫిబ్రవరికి ఫస్ట్ ఫేజ్ — వెస్ట్ సైడ్ భాగం పూర్తయ్యేలా లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. దసరా సమయంలో ముంబై, కాజీపేట, విశాఖపట్నం రూట్లలో నడిచే రైళ్లను ప్రయాణికుల సౌకర్యార్థం హైటెక్ సిటీలో ఆపినట్లు, అలాగే సంక్రాంతి సందర్భంగా 16 స్పెషల్ ట్రైన్లు కూడా ఇక్కడ ఆగనున్నట్లు తెలిపారు. మరిన్ని రైళ్లు ఇక్కడ ఆపేందుకు ట్రయల్ బేసిస్‌లో నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు.





తెలంగాణలో 40 రైల్వే స్టేషన్లతో పాటు కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణం పూర్తిగా ముగిసిందని, త్వరలో భక్తుల కోసం ప్రారంభిస్తామని కిషన్ రెడ్డి తెలిపారు. ఎంఎంటీఎస్ సెకండ్ ఫేజ్‌ను యాదాద్రి వరకు పొడిగించే ప్రతిపాదనపై ఇప్పటికే టెండర్లు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా రైల్వే లైన్ల ఎలక్ట్రిఫికేషన్ 100 శాతం పూర్తయిందని, వైఫైతో సహా అనేక ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. కాజీపేటలో నిర్మాణం జరుగుతున్న రైల్వే మల్టీ మ్యాన్యుఫాక్చరింగ్ యూనిట్ (RMU) పనులను రేపు పరిశీలించనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణ రైల్వే మౌలిక వసతులను అద్భుతంగా తీర్చిదిద్ది, కొత్త రైల్వే లైన్ల నిర్మాణంతో మరింత అభివృద్ధి సాధించేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, బడ్జెట్‌ను ముందు ఊహించని స్థాయిలో భారీగా కేటాయిస్తోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.



# జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

**వికారాబాద్, నవంబర్ 28(ప్రజా స్వరం:**

జిల్లాలోని 27I స్కూళ్ల ద్వారా జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ మీట్ వికారాబాద్ జిల్లా కేంద్రం లోని సెయింట్ జ్యూడ్స్ హై స్కూల్లో శుక్ర వారం ప్రారంభించడం జరిగింది. ఈ స్పోర్ట్స్ మీట్ శుక్ర,శని రెండు రోజులపాటు విజయవంతంగా నిర్వహించడం జరుగుతుంది. ఇందులో 27 పాఠశాలల నుంచి మొత్తం 867 మంది విద్యార్థులు క్రీడ పోటీల్లో పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఫుట్బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు అలాగే అథ్లెటిక్స్ లో భాగంగా లాంగ్ జంప్, షార్ట్ పుట్, 100 మీటర్స్ రన్నింగ్ ని నిర్వహించడం జరుగుతుంది. ఈ పోటీలు జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుంది. ఇందులో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి రేణుక దేవి, జిల్లా విద్యాశాఖ అధికారులు, పీడీలు, వివిధ పాఠశాలల్లోనీ ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# ఇందిరమ్మ క్యాంటీన్లకు ప్రభుత్వం వేగం

- రూ.5కే నాణ్యమైన భోజనం
- బాగ్ లింగంపల్లిలో కొత్త క్యాంటీన్ ప్రారంభం
- GHMC కొత్త లొకేషన్ల మ్యాపింగ్ సిద్ధం

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

పేద, మధ్యతరగతి ప్రజలకు చౌక ధరకే కడుపు నిండా భోజనం అందించే ఇందిరమ్మ క్యాంటీన్ల విషయంలో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. హైదరాబాద్‌లో కొత్తగా క్యాంటీన్లు ఏర్పాటు చేసేందుకు మ్యాపింగ్ కూడా సిద్ధమైంది. కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్, లంచ్ అందించే ఈ స్కీమ్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

తెలంగాణలో పేదల ఆకలిని తీర్చే లక్ష్యంతో ఇందిరమ్మ క్యాంటీన్ల ఎస్టాబ్లిష్‌మెంట్ కోసం GHMC అధికారులు మ్యాపింగ్ ప్లానింగ్ను ఇప్పటికే సిద్ధం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ... బాగలింగంపల్లి సుందరయ్య పార్క్ వద్ద ఒక కొత్త ఇందిరమ్మ క్యాంటీన్‌ను లాంచ్ చేశారు. నగరానికి ఉపాధి కోసం వస్తున్న వేలాది మందికి ఈ క్యాంటీన్లు చాలా సౌకర్యంగా ఉంటాయని తెలిపారు.

ముఖ్యంగా ఉదయాన్నే పనికి వెళ్లేవాళ్లు ఎక్కడికీ ఇబ్బంది పడకుండా.. ఇక్కడే కేవలం ఐదు రూపాయలకే నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్నం సమయంలో భోజనం తీసుకోవచ్చని స్పష్టం చేశారు. ఇంకా ఎక్కడైనా కొత్తగా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనుకుంటే... ప్రజలు లేదా ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తే, ప్రభుత్వం తరపున ఆ ప్రాంతాన్ని గుర్తించి త్వరలోనే ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ఈ చొరవతో... హైదరాబాద్ నగరంలో పేదలకు ఆకలి బాధలు తీరే ఛాన్స్ ఉంది.





# బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గెలవబోతున్నారు

- హామీలు అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రామాల్లో ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పబోతున్నారు..
- పైలెట్ రోహిత్ రెడ్డి

**తాండూరు,నవంబర్ 28(ప్రజా స్వరం):**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు పెద్ద సంఖ్యలో గెలవబోతున్నారని పైలెట్ రోహిత్ రెడ్డి గారు అన్నారు. శుక్ర వారం జిల్లాలోని తాండూరు మండలం మల్కాపూర్ గ్రామ పంచాయతీ లో సంగెం కాలాన్ సర్పంచ్ అభ్యర్థిగా కామిని మీనాక్షి అనిల్ నామినేషన్ దాఖలు కార్యక్రమానికి పైలెట్ రోహిత్ రెడ్డి గారు హాజరై బీఆర్ఎస్ నాయకులతో కలిసి నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారికి సమర్పించారు. 420 హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రామాల్లో ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పబోతున్నారు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాయిపూర్ నర్సింలు, శ్రీనివాస్ చారి, మండల పార్టీ అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, రత్నాకర్, సునీల్ పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# పంచాయతి ఎన్నికలు పొరపాట్లు లేకుండా నిర్వహించాలి

- నామినేషన్ల ప్రక్రియను సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించాలి
- అభ్యర్థులు పత్రాల సమర్పణపై ముందుగా అవగాహన అవసరం
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్
- పెద్దేముల్, యాలాల మండలాల్లో పర్యటించిన కలెక్టర్

**వికారాబాద్, నవంబర్ 28( ప్రజాస్వరం):**

పంచాయతి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని, నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చేయకుండా జాగ్రత్త లు తీసుకోవాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఎన్నికల పర్యవేక్షణ అధికారులు సిబ్బందికి సూచించారు జిల్లాలోని తాండూరు నియోజకవర్గం పెద్దేముల్, యాలాల మండలాల్లో పంచాయతీ ఎన్నికల క్లస్టర్లను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు.. ఆయా కేంద్రాలలో అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి తప్పులు, పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో అభ్యర్థుల నుంచి కావాల్సిన పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలన్నారు.నామినేషన్ల పత్రాలు స్పష్టంగా పరిశీలించుకునేలా అభ్యర్థులకు సహకరించాలని అన్నారు. అదేవిధంగా ఎన్నికల సమయంలో అభ్యర్థుల ఖర్చుల వివరాలు ఎప్పటికప్పుడు తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అభ్యర్థుల బ్యాంకు ఖాతా ఉండేలా చూసుకోవాలన్నారు. సర్పంచులు, వార్డు సభ్యులు నిబంధనలకు అనుగుణంగా ఖర్చులు పెట్టాలనే విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సమయానికి అవసరానికి అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు రతన్ సింగ్, శ్రీనిజ, తదితరులు పాల్గొన్నారు.



# వరికొయ్యలు కాల్చితే కాలుష్య కాసారమే..

- **మండల వ్యవసాయ అధికారి వసంతరావు**

**జగదేవ్‌పూర్, ప్రజాస్వరం :**



వరి కొయ్యలను కాలిస్తే పర్యావరణానికి తీవ్రం ఉప్పు వాటిల్లుతుందని మండల వ్యవసాయ అధికారి వసంతరావు అన్నారు. వట్టిపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు.వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు వరి కోయలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుంది. విపరీతమైన వేడితో భూమి సారాన్ని కోల్పోతుంది. దిగుబడి తగ్గిపోతుంది. పంటలకు అవసరమయ్యే పోషకాలు దెబ్బతింటాయి అని మేలు చేసే సూక్ష్మజీవులు చనిపోయి పొలాల్లో ఉండే అనేక జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉందని దీంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతిని దిగుబడులు తగ్గుతాయని అన్నారు. ఆలస్యంగా కోతకు వచ్చే పంటలు కల్లాల దగ్గరే ఉంటే ధాన్యం కాలిపోయే ప్రమాదం ఉందని అన్నారు.భూమిలో కలియ దున్నితేఎన్నో ప్రయోజనాలు వరి కొయ్యలు నెలలో కలియదండటం వల్ల సేంద్రియ కర్బన శాతం పెరిగి దిగుబడులు ఐదు నుండి 10 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని, దూకి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మునిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయని ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుందని, ఎకరాకు దాదాపు టన్ను ఎరువు తయారవుతుందన్నారు. మొక్కలకు రెండు శాతం నత్రజని నాలుగు శాతం పాస్పరస్ అదనంగా అందుతుందని, వీటితోపాటు జింకు, మ్యాంగనీస్, ఇనుము మరియు క్యాల్షియం లాంటి సూక్ష్మధాతువులు అంది పంటకు మేలు చేకూరుస్తాయన్నారు. అలాగే భూమి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. కొయ్యకాళ్లను భూమిలో కలయదున్నితే గడ్డి ద్వారా పోషకాలు తిరిగి నేలకు చేరతాయని పొలం దున్నే పది రోజులు ముందు గడ్డిని పొలంలో పరిచి నీరు అందించాలి తర్వాత ఎకరారకు 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ చల్లాలి. దీనితో భూమి దెబ్బతినడం నుంచి తప్పించడం కాకుండా భూమిలో సేంద్రియ పదార్థాలు స్థాయిని పెంచవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి కృష్ణమూర్తి, వడ్ల కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు షాదుల్లా రైతులు పాల్గొన్నారు.



# కాళ్లకల్ మల్లన్న ఆలయ నిర్మాణం కోసం సమావేశం

**మనోహరబాద్, (ప్రజాస్వరం) :**

మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో గల శ్రీ శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి యాదవ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదునాతున పద్ధతిలో ఆలయం నిర్మాణం చేయడుతామని త్వరలో భూమి పూజ చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యాదవ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి

- **ఈవో అంజిరెడ్డి**

**నార్సింగి, నవంబర్ 28 (ప్రజా స్వరం) :**



ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామ అభివృద్ధికి సహకరించాలని నార్సింగి ఇన్చార్జి ఈఓ అంజి రెడ్డి అన్నారు. నార్సింగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఈఓ అంజిరెడ్డి మాట్లాడుతూ బకాయిలు ఉన్న వారు ఇంటి పన్నులను వెంటనే చెల్లించాలని, గ్రామాభివృద్ధి కోసం ఆ నిధులు ఉపయోగపడతాయని, గ్రామ అభివృద్ధికి అందరు సహకరించాలని అయన అన్నారు. పంచాయతీ పరిధిలోని వాణిజ్య సముదాయాల లైసెన్స్ రెన్యువల్ చేసుకోని వారు పంచాయతీ కార్యాలయంలో నిర్దేశిత రుసుము చెల్లించి తమ వ్యాపార లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని అన్నారు. జరగబోయే స్థానిక ఎన్నికలలో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థులు పంచాయతీకి ఏమైనా బకాయి ఉన్నట్లయితే వెంటనే బకాయిలు చెల్లించి నో డ్యూ సర్టిఫికెట్ పొందాలని, ఎన్నికల బరిలో పోటీ చేసే వ్యక్తులు ఏదేని బ్యాంకు లో గానీ, పోస్ట్ ఆఫీస్ లో గానీ కొత్తగా ఖాతా ను తెరుచుకోవాలని, సంబంధిత బ్యాంక్ ఖాతానుండి మాత్రమే లావాదేవీలు జరపాలని, జిరాక్స్ ప్రతులు నామినేషన్ పత్రాలతో సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. తాము గ్రామ అభివృధి కి కట్టుబడి ఉన్నామని, ప్రజలు తమ వంతు సహకారం అందించాలని ఇంచార్జి ఈఓ అంజి రెడ్డి విజ్ఞప్తి చేశారు.





# మాజీ కౌన్సిలర్‌కు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు

**మేడ్చల్, ప్రజాస్వరం :**

మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్ కు డిసిసి అధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్ వివాహ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్న విషయం తెలుసుకున్న డిసిసి అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ స్వయంగా భవాని రాఘవేందర్ గౌడ్ ఇంటికి వెళ్లి వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవాని రాఘవేందర్ గౌడ్ ఆనందం వ్యక్తం చేశారు. డిసిసి అధ్యక్షుడు తన ఇంటికి వచ్చి వివాహ శుభాకాంక్షలు తెలపడం వల్ల ఆనందం పట్టలేకపోయామని భవాని రాఘవేందర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# డాక్టర్ హేమరాజ్ సింగ్‌కు సన్మానం



**దుబ్బాక , నవంబర్ 28 (ప్రజాస్వరం) :**

సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లో డయాలసిస్ సేవలలో ఉత్తమ ప్రతిభను కనబరచి తెలంగాణ రాష్ట్రము లోనే రెండవసారి ప్రథమ స్థానంలో రావడానికి కృషి చేసిన ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ హేమరాజ్ సింగ్ నిఅపెక్స్ ప్రధాన కార్యాలయ బృందం సన్మానించడం జరిగినది, ఏరియా హాస్పిటల్ దుబ్బాక మెడికల్ సూపరింటెండెంట్ డయాలసిస్ రోగులగు అన్ని రకాల సౌకర్యాలు ఎప్పటికప్పుడు ఏర్పాటు చేయడములో కీలక పాత్ర పోషిచడం వలన డయాలసిస్ రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందిచడం జరుగుతుంది అందుకే దుబ్బాక ప్రభుత్వ ఆసుపత్రి అన్ని రంగాలలో ముందు ఉండటం జరుగుతుంది అదేవిధముగా దుబ్బాక డయాలసిస్ సిబ్బంది రోగుల పట్ల ప్రేమతో సేవలను అందిస్తున్నందుకు చాలా గర్వాంగా ఉందనీ డాక్టర్ హేమరాజ్ సింగ్ అన్నారు ఈకార్యక్రమంలో. డయాలసిస్ ప్రధాన కార్యాలయ. కిషోర్ కుమార్, కిషన్, జీవన్, మరియు డయాలసిస్ సిబ్బంధి శేఖర్. సురేష్. స్వామి. మనసా. వివేక్. రమేష్.తదితరులు ఉన్నారు..

# వారం రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి

- **తహసీల్దార్ గ్రేస్ బాయ్**

**నార్సింగి, నవంబర్ 27 (ప్రజా స్వరం) :**



నార్సింగి మండల పరిధిలోని మూడు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వడ్ల కొనుగోలు పూర్తి అయ్యాయని తహసీల్దార్ గ్రేస్ బాయి తెలిపారు. ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6 కొనుగోలు కేంద్రాలలో నర్సంపల్లి, పెద్ద తండా, జప్తి శివునూరు లలో వడ్ల కొనుగోలు ప్రక్రియ పూర్తి అయ్యిందని మిగతా కొనుగోలు కేంద్రాలలో కూడా ఒక వారం రోజులలో కొనుగోళ్లు పూర్తి అవుతాయాని అన్నారు. ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 6 కొనుగోలు కేంద్రాలలో శుక్రవారం సాయంత్రం వరకు 39 రైతుల నుంచి 3022 బస్తాలలో 120.88 టన్నుల సన్న రకం వరి ధాన్యం సేకరించడం జరిగిందని తెలిపారు. 761 రైతుల నుంచి 78,353 బస్తాలలో 3134.12 టన్నుల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేశారని తెలిపారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఒకటి, జప్తి శివునూరులో ఒకటి మొత్తం రెండు కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం సేకరించారని అన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 29మంది రైతుల నుంచి 3,800 సంచులలో 931.76 క్వింటాళ్ల సన్నరకం ధాన్యం, 723 రైతులకు చెందిన 69,629 సంచులలో 2,785.16 క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేశారని తెలిపారు. ఫార్మర్ ప్రొడక్షన్ కంపెనీ (ఎఫ్.పీ.సీ) వారు మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి 91 రైతుల నుంచి 7,402 సంచులలో 2,960.8 క్వింటాళ్ల సన్న రకం, 413 రైతుల నుంచి 36,038 బస్తాలలో 14,415.2 క్వింటాళ్ల దొడ్డు రకం ధాన్యం సేకరించారని తెలిపారు. మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు ఎలాంటి ఇబ్బందుకు కలగకుండా వరి ధాన్యం సేకరణ జరుగుతుందని, బిల్లులు కూడా సకాలంలోనే రైతుల ఖాతాలలో జమ అవుతున్నాయని, సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన విధంగా 500 రూపాయల బోనస్ కూడా ఇస్తున్నారని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందుకు కలగకుండా ధాన్యం సేకరణ పూర్తిగా జరుగుతుందని, రైతుల ఆందోళన పడాల్సిన అవసరం లేదని తహసీల్దార్ గ్రేస్ బాయి అన్నారు.



# పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటాలి

- **కష్టపడే వారికి పార్టీలో సంవత్సర స్థానం ఉంటుంది**
- **రానున్న 10 సంవత్సరాలు మనదే అధికారం**
- **రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి**

**మెదక్, నవంబర్ 28 (ప్రజా స్వరం) :**



యూత్ కాంగ్రెస్ లో కష్టపడి పని చేసిన వారికి పార్టీ సముచిత స్థానం ఇస్తుందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రం టీఎన్జీవో భవన్ లో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పరశురామ్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా యువజన కాంగ్రెస్ కార్య నిర్వాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ నాయకులు తప్పకుండా పోటీ చేయాలని, బాగా పనిచేసి, యువజన కాంగ్రెస్ నాయకులను గెలిపించి, కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలన్నారు. యూత్ కాంగ్రెస్ అనేది యువతకు మంచి వేదిక అని గతంలో ఇందులో కష్టపడి పనిచేసిన వారు కీలక పదవుల్లో ఉన్నారన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ కు 20% ఇవ్వాలని కోరిన వెంటనే ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. దీనికి నిదర్శనగానే యూత్ కాంగ్రెస్ నాయకులకు తాజాగా ప్రకటించిన డీసీసీ అధ్యక్షులల్లో 8 మందికి, అదే విధంగా ఒక ఎమ్మెల్సీ, ఒక రాజ్య సభ ఎంపీ, అలాగే స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ గా అన్ని విభాగాలలో అవకాశాలు ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి నిలబడే వ్యక్తిని గెలిపించడానికి యూత్ కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, రానున్న 10 సంవత్సరాలు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండటం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి & తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ భవ్య సింగ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు మహేందర్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శులు పొవాకు తరుణ్, సంతోష్ గౌడ్, రామచందర్ రెడ్డి, మెదక్ అసెంబ్లీ అధ్యక్షుడు భరత్ గౌడ్, నర్సాపూర్ అసెంబ్లీ అధ్యక్షుడు సందీప్, జిల్లా కమిటీ, అసెంబ్లీ కమిటీ అన్ని మండల అధ్యక్షులు, పెద్ద ఎత్తున్న యువజన కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.





# అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తీగుల్ల స్వామి, నాగవేందర్

**నార్సింగి, నవంబర్ 28 (ప్రజా స్వరం) :**

నార్సింగి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నార్సింగి మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా తీగుల్ల స్వామి, నాగవేందర్ రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ లు తెలిపారు. ఈ సందర్భంగా మండల నూతన అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ తమ పై నమ్మకం ఉంచి తమకు ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని, అందరూ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు సంతోష్, జెట్టి మల్లేశం, రాజశేఖర్, బండి నరేష్ గౌడ్, యాదగిరి, రమేష్ పాల్గొన్నారు.

# కొనసాగిన నామినేషన్ల పర్వం

**దౌల్తాబాద్, నవంబర్ 28( ప్రజాస్వరం) :**



దౌల్తాబాద్ మండలంలో పంచాయతీ ఎన్నికల వేడి పెరిగింది. శుక్రవారం నామినేషన్‌ల దాఖలు వేగంగా సాగింది. మొత్తం 24 గ్రామపంచాయతీలకు సర్పంచ్ పదవికి 33 మంది, వార్డు సభ్యుల పదవులకు 66 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మండల కేంద్రం మొత్తం అభ్యర్థులు, అనుచరులు, రాజకీయ నాయకులు, గ్రామ పెద్దల రాకపోకలతో ఒక పండుగ వాతావరణంలా మారింది. గ్రామాల వారీగా అభ్యర్థుల పేర్లు ఖరారవుతుండడంతో రాజకీయ చర్చలు ఊపందుకున్నాయి. ప్రతిభా, అభివృద్ధి, స్థానిక సమీకరణాలు కీలకంగా మారనున్నాయి. ఇక రేపు నామినేషన్ల చివరి రోజు కావడంతో ఇంకా కొన్ని గ్రామాల్లో సర్పంచ్, వార్డు స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. చివరి రోజు మరింత రద్దీగా ఉండే అవకాశం ఉన్నట్లు ఎన్నికల నిర్వాహకులు తెలిపారు.

# నామినేషన్ల ప్రక్రియను పకడ్బందీగా జరగాలి

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, నవంబర్ 28 (ప్రజా స్వరం) :**

ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరపాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం హవేలీ ఘనపూర్ మండల కేంద్రం లోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్లు రెండో రోజు ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా సాగేందుకు చర్యలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అభ్యర్థులకు సమాన అవకాశాలను కల్పించాలని, అలాగే నామినేషన్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, శాంతి యుత వాతావరణం ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణం స్పందిస్తూ సమన్వయం చేసుకోవాలని సూచించారు. మొదటి విడత నామినేషన్లకు 29 వ తేదీ చివరి రోజు కావడంతో అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంటుందని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. నామినేషన్ పత్రాలు అధికంగా ఉంచాలని, నామినేషన్లు వెంట వెంటనే స్కాన్ చేసి ఎన్నికల సంఘానికి పంపించేందుకు జిపిఓ లను అదనపు సిబ్బందిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ఖచ్చితమైన ధ్రువపత్రాలతో నామినేషన్ కేంద్రాలను సంప్రదించాలని, సహాయతకు హెల్ప్ డెస్క్ ను సంప్రదించాలని



స్పష్టం చేశారు. అభ్యర్థి ఎన్నికల ఖర్చు వివరాల నమోదుకు ప్రత్యేక బ్యాంక్ ప్రారంభించాలని లావాదేవీలు కచ్చితంగా బ్యాంకు ఖాతా నుండి జరపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రిటర్నింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలికంగా ప్రజావాణి వాయిదా

- **జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్**

**మెదక్, నవంబర్ 28 ప్రజా స్వరం :**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెల్ప్ డెస్క్ ద్వారా మాత్రమే ఫిర్యాదులు స్వీకరించబడునున్నారు .ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.




# బడి బయట పిల్లల సర్వే



**దౌల్తాబాద్, నవంబర్ 28( ప్రజా స్వరం):**

మండల పరిధిలో బడి బయట పిల్లలను గుర్తించి విద్యావ్యవస్థలోకి తీసుకురావడానికి చేపట్టిన ప్రత్యేక సర్వే కార్యక్రమంలో భాగంగా తిరుమలాపూర్ గ్రామంలో గురువారం విస్తృతంగా సర్వే నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉన్న ఇటుక బట్టిలో పనిచేస్తున్న పిల్లలను గుర్తించే క్రమంలో ఇద్దరు ఛత్తీస్గఢ్‌కు చెందిన పిల్లలు, మరో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన పిల్లలు బడి బయట ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా పిల్లలను మళ్లీ విద్యలోకి చేర్చేందుకు చేపట్టే చర్యలపై అధికారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిరుమలాపూర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్. ప్రశాంత్, సీఆర్పీ నాగేష్ పాల్గొని సర్వేను పర్యవేక్షించారు.



# దివ్యాంగులు స్ఫూర్తి ప్రదాతలు

- **జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి**

**వికారాబాద్, నవంబర్ 28(ప్రజా స్వరం):**

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ( 3 డిసెంబర్ , 2025 ) పురస్కరించుకొని మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగులకు జిల్లాస్థాయి ఆటల పోటీలు వికారాబాద్ జిల్లా కేంద్రం లోని స్థానిక బ్లాక్ గ్రౌండ్ లో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి మాట్లాడుతూ శుక్ర వారం దివ్యాంగులను జూనియర్స్ ( 0 నుండి 18 సంవత్సరాలు ) , సీనియర్స్ ( 18 నుంచి 54 సంవత్సరాలు ) రెండు విభాగాలుగా విభజించి క్రీడల్లో భాగంగా అంధులకు రన్నింగ్, షాట్ పుట్, చెస్, బదిరులకు రన్నింగ్, షాట్పుట్, జావెలిన్ త్రో, శారీరక దివ్యాంగు లకు షాట్పుట్, క్యారం, జావెలిన్ త్రో, బుద్ధి మాంద్యం వారికి రన్నింగ్, షాట్పుట్ వంటి క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. అదేవిధంగా సమాజంలో దివ్యాంగులు సాధారణ పౌరులతో సమానంగా అన్ని రంగాల్లో బాగా రాణిస్తు స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని జిల్లా అధికారిణి కృష్ణవేణి అన్నారు. అన్ని అవయవాలు సక్రమంగా పనిచేసే వ్యక్తులు విజయాలను సాధిస్తే, ప్రతికూలతలను అదిగమిస్తూ అసమాన విజయాలను సాదించే దివ్యాంగులు ఎంతో మందికి స్ఫూర్తి ప్రదాతలుగా నిలుస్తారని అన్నారు. దివ్యాంగుల తల్లి తండ్రుల కన్న టీచర్లు, గార్డియన్లు పిల్లలకు తోడుగా నిలిచి వారికి సకాలంలో సరైన ప్రోత్సహన్ని అందిస్తు దివ్యాంగులను ముందుకు నడిపించాలని ఇలాంటి వేడుకలు నిర్వహించడం ద్వారా దివ్యాంగులు ఎవరిపైనా ఆధారపడకుండా తమ కాళ్లపై తామే నిలబడాలని మనోస్థైరం పెరగడమే కాక వారిలో ఉన్న ఆత్మస్థైర్యానికి ఇలాంటి ఆట పోటీలు నిర్వహించడం వల్ల వాళ్లలో ఉన్న ఆ భద్రత భావం పోతుందని. అంతేకాక ప్రభుత్వం మహిళా శిశు సంక్షేమ శాఖ తరపున దివ్యాంగులను అవసరమైన సదుపాయాలను కల్పిస్తూ వారిని అన్ని విధాలా ప్రోత్స హిస్తూ దివ్యాంగులలో ఆత్మ గౌరవాన్ని మరింత పెంచి సమాజంలో దివ్యాంగుల పట్ల చూపిస్తున్న వివక్షతను పారదోలెందుకు ఉపయోగపడుతుందని తెలియజేయడం జరిగింది. జిల్లా స్థాయి ఆటల పోటీలలో పాల్గొన్న వారందరు రాష్ట్ర స్థాయిలో కూడా అద్భుతమైన విజయాలను సాదించాలని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ కాంతారావు, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ సిబ్బంది ,ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ చెందిన పీఈటీలు, , వికారాబాద్ జిల్లాకు చెందిన దివ్యాంగుల సంఘాల నాయకులు మరియు దివ్యాంగులు హాజరు కావడం జరిగింది.





# పదవ తరగతి ప్రత్యేక తరగతుల పర్యవేక్షణ



**దౌల్తాబాద్, నవంబర్ 28(ప్రజాస్వరం):**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దొమ్మాటలో నిర్వహిస్తున్న పదవ తరగతి ప్రత్యేక తరగతులను మండల విద్యాధికారి గజ్జెల కనకరాజు గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతీ విద్యార్థి పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పదవ తరగతి జీవితంలో తొలి మెట్టు అని, ఈ దశలో సాధించిన విజయమే భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని తెలిపారు. విద్యార్థులు 100% ఉత్తీర్ణత లక్ష్యంగా ముందుకు సాగాలని, సాధ్యమైనంత మేర 10/10 GPA సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే పరీక్షలు ఎలా రాయాలో ప్రశ్నపత్రం సమయ నిర్వహణ ఎలా చేయాలో వివిధ మెలకువలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల ఉపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయుడు యాదగిరి పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జైలు శిక్ష

**దౌల్తాబాద్ నవంబర్ 28( ప్రజా స్వరం) :**

బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి సబ్ ఇన్స్పెక్టర్ మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒక వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో మద్యం సేవించినట్టు నిర్ధారణ కావడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని న్యాయస్థానంలో హాజరుపరిచారు. శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ శుక్రవారంమెజిస్ట్రేట్ స్వాతి గౌడ్ ముందు నిందితుడిని హాజరుచేయగా, విచారణ అనంతరం 2 రోజుల జైలు శిక్ష విధించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్ మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ఈ విధి ఉల్లంఘనలు రోడ్డు ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజల్లో అవగాహన పెంచడంలో భాగంగా ప్రతిరోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

# కమ్ముకుంటున్న మంచుతో చలి

- **వాహనదారులకు రాకపోకలకు ఇబ్బందులు**

**దౌల్తాబాద్, నవంబర్ 28 ( ప్రజాస్వరం ):**

రాత్రి పొడవునా కమ్ముకున్న చలి, తెల్లవారుజాము నుంచి దట్టంగా కమ్మిన పొగమంచుతో గ్రామాలు వణికిపోతున్నాయి. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో శుక్రవారం ఉదయం 5 గంటల నుంచే పొగమంచు దట్టంగా ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. ఉదయం 7 గంటలవరకు కొనసాగిన ఈ మంచు దుప్పటి కారణంగా రాకపోకలు గణనీయంగా మందగించాయి. చుట్టుపక్కల కనిపించని పరిస్థితిలో చాలామంది వాహనదారులు హెడ్‌లైట్లు వెలిగించి జాగ్రత్తగా ప్రయాణించాల్సి వచ్చింది. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాల వైపు వెళ్లే రైతులు కూడా పొగమంచు కారణంగా బెదిరిపోయారు. రాయపోల్ నుంచి దౌల్తాబాద్ వరకు దారి మొత్తం దట్టమైన మంచుతో కప్పుకుపోవడంతో ఎదురెదురు వచ్చే వాహనాలు కనిపించకుండా పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఉదయం 5 గంటల సమయంలో రాయపోల్-తిమ్మక్కపల్లి రహదారిపై ప్రతి రోజూ మార్నింగ్ వాకింగ్ చేసే యువకులు కూడా బెంబేలెత్తిపోయారు. పక్కదారి స్పష్టంగా కనిపించకపోవడంతో వారు మొబైల్ ఫోన్ల లైట్ల సాయంతోనే నడక కొనసాగించారు. ఇక గ్రామాల్లో చలి తీవ్రత విపరీతంగా పెరగడంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె మంటలు వెలిగించి చలినుంచి రక్షణ పొందే పరిస్థితి నెలకొంది. గత రెండు మూడు రోజులుగా చలి తీవ్రంగా పెరగడంతో సాయంత్రం వేళ గ్రామ వీధులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. శుక్రవారం ఉదయం పడిన ఈ దట్టమైన పొగమంచు వలన వాహనదారులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున ఇబ్బందులు పడ్డారు.





# ఇండ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయండి

- **ప్రజావాణిలో బీజేపీ నేతల వినతి**

**జవహర్ నగర్, ప్రజాస్వరం :**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో దాదాపు 30 సంవత్సరాలుగా ప్రజలు నివసిస్తున్న 318 ఎకరాల గ్రామ కంఠంలో పరిధిలో ఇంటి నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయడం కొత్తగా కట్టుకున్న ఇళ్లకు ఇంటి పన్ను తీసుకునే విధంగా ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయాలని శుక్రవారం బేగంపేటలోని మహాత్మా జ్యోతిరావు పూలే భవన్లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జవహర్ నగర్ బిజెపి నాయకులు వినతిపత్రం అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2015 సంలో అధికార ప్రభుత్వం 58, 59 జీవో పేరుతో దాదాపు 7 ఏడు కోట్ల రూపాయలు జవహర్ నగర్ ప్రజల నుంచి వసూలు చేసిందని ఇప్పటివరకు వాటిపై ఎలాంటి స్పందన రాలేదని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రష్ యాదవ్,కాంగ్రెస్ నాయకులకు జవహర్ నగర్ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు.జవహర్ నగర్ దాదాపు 30 సంవత్సరాల నుంచి గ్రామ పంచాయతీ, మున్సిపల్ కార్పొరేషన్ గా మారిన ఇప్పటికీ ఇండ్ల నిర్మాణానికి అనుమతిని ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం దీనిపై సరియైన న్యాయవిచారణ చేసి జవహర్ నగర్ లో ఇళ్ల నిర్మాణం, అనుమతులు, రిజిస్ట్రేషన్ లపై వెంటనే ఇంతకు నిర్ణయం తీసుకొని అక్కడి ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర ఓబిసి మోర్చా అధికార ప్రతినిధి రంగుల శంకర్, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యదర్శి ముత్యం సుజాత, జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ బీజేవైఎం అధ్యక్షులు రాము నాయక్, ప్రధాన కార్యదర్శులు వేపుల సన్నీ, ముచ్చర్ల యాదగిరి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మీరెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు కొంపెల్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా,
# మున్సిపల్ అధికారులు

- రాంనగర్, రేకుర్తి మరియు చైతన్య పురిలలో తనిఖీలు నిర్వహించారు.

**కరీంనగర్ నవంబర్ 28(ప్రజాస్వరం):**

పార్కింగ్ స్థలాల సముచిత వినియోగాన్ని ధృవీకరించడానికి మొత్తం 20 వాణిజ్య సెల్లార్లను తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో, పార్కింగ్ కోసం ప్రత్యేకంగా ఉద్దేశించిన అనేక సెల్లార్ ప్రాంతాలను వాణిజ్య ప్రయోజనాల కోసం మరియు నిల్వ కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు గమనించబడింది. దీని ప్రకారం, పార్కింగ్ మరియు సెల్లార్ వినియోగ నిబంధనలను ఉల్లంఘించినందుకు సంబంధిత భవన యజమానులకు 15 నోటీసులు జారీ చేయబడ్డాయి. పార్కింగ్ కోసం సెల్లార్ స్థలాలను వెంటనే పునరుద్ధరించాలని మున్సిపల్ కమిషనర్ యజమానులను ఆదేశించారు. మరియు నిర్ణీత సమయంలో పాటించని వారిపై జరిమానాలు మరియు ప్రాంగణాన్ని మూసివేయడం వంటి కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవన నిబంధనలను పాటించాలని మరియు సెల్లార్ ప్రాంతాలను తప్పనిసరి ప్రకారం పార్కింగ్ కోసం మాత్రమే ఉపయోగించాలని మునిసిపాలిటీ అన్ని వాణిజ్య సంస్థలకు విజ్ఞప్తి చేసింది.




## బెల్టు షాపు నడుపుచున్న వ్యక్తుల బైండోవర్

**కరీంనగర్ రూరల్, నవంబర్ 28(ప్రజాస్వరం):**

గ్రామ పంచాయతీ ఎన్నికల దృశ్య మండలంలో బెల్టుషాపు నడుపుచున్న వ్యక్తులు మరియు క్రితం ఎలక్షన్లలో కేసులు నమోదైన వారు మరియు రౌడీ షీటర్లు మొత్తం 7 కేసులపై 28 మందిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టి ఒక్కొకరికి లక్ష రూపాయల పూచీకతు పై బైండోవర్ చేయడమైనది, మరియు కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా బెల్టు షాపులు నడిపితే వారిపై కేసులు నమోదు చేసి వారిని జైలుకు పంపుతామని మరియు ఎలక్షన్ ముగిసే వరకు గ్రామాల్లో ఎలాంటి అలజడులు జరగకూడదని, ఎలక్షన్ కమిషన్ కు వ్యతిరేకముగా ఎటువంటి కార్యక్రమాలు చేసిన, కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.




## మక్తల్ పట్టణంలో మానవతా దృక్పథం చాటుకున్న మున్సిపల్ కార్మికులు మరియు కరాటే మాస్టర్ సలీం

**మక్తల్ ప్రతినిధి నవంబర్ 28(ప్రజాస్వరం):**

మానవత్వం చాటుకున్న మక్తల్ మండల ప్రజలు కరెంటు వైర్లకు తగిలిన వారధిని కాపాడిన మున్సిపల్ కార్మికులు మరియు కరాటే మాస్టర్ సలీం మక్తల్ పట్టణంలో శుక్రవారం ఉదయం ఎమ్మార్వో కార్యాలయం ముందు ఒక వానరుడు చెట్టుపై నుంచి కిందికి దిగుతుండే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగకు తగిలి పైనుంచి కింద పడిపోవడం జరిగింది. అది పడిపోవడం గమనించిన మక్తల్ మున్సిపల్ కార్మికులు మరియు కరాటే మాస్టర్ సలీం వానరుడికి సిపిఆర్ చేసి కోతిని బతికించడం జరిగింది. వారికి మక్తల్ ప్రజలు అభినందించారు.



## వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకుడు
# గుండెపోటుతో ఆకస్మిక మృతి.

**బంగారుపాలెం నవంబర్ 28(ప్రజాస్వరం):**



చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం కాటప్పగారి పల్లి పంచాయతీ ఎగువఎద్దుల వారి పల్లి హెచ్ డబ్ల్యు గ్రామానికి చెందిన పి. వెంకటముని వయస్సు 54 సంవత్సరాలు, గత కొద్ది నెలలుగా ఆరోగ్యం బాగాలేక ఇబ్బంది పడేవాడు. గత కొన్ని సంవత్సరాల క్రితం గ్రామ పెద్దగా కూడా పని చేశారు. గ్రామంలో కొన్ని సమస్యలు పరిష్కరించడం కానీ, గ్రామంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేశారు. బోడబండ్ల గ్రామానికి కూడా గత 20 సంవత్సరాలకు పైగా వెంకటముని తన సేవలను అందించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనూ తదుపరి వైఎస్ఆర్సిపి పార్టీ కి క్రియాశీలకంగా కూడా వ్యవహరించారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు అకస్మాత్తుగా చాతిలో నొప్పి రావడంతో బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తీసుకువస్తుండగా కాటప్ప గారి పల్లి దాటిన తర్వాత ఛాతిలో ఎక్కువ నొప్పి రావడంతో మరణించడం జరిగింది. తన మరణవార్త తెలియగానే బంధువులు తెలిసినవారు ఆత్మీయులు ఎంతగానో శోభించారు. ఓవైపు పంచాయతీ పరిధిలో వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు వెంకటముని మరణవార్త తెలియగానే చాలా బాధపడినట్లు తెలిపారు. తన కుమారుడు ప్రదీప్ గత ప్రభుత్వంలో ఎద్దులవారి పల్లె గ్రామం నందు వాలంటీర్ గా కూడా పనిచేశారు.

## మహిళా లోకాన్ని అక్షరాస్యత వైపు
# నడిపించిన మహాత్ముడైన పూలే

- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- కుల వివక్షను రూపుమాపిన సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే
- పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు
- పూలే ఆశయాలను కొనసాగించడం కాంగ్రెస్ తోనే సాధ్యం.
- వైద్యుల అంజన్ కుమార్, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు

**కరీంనగర్, నవంబర్ 28(ప్రజాస్వరం):**

డిసిసి కార్యాలయం, కరీంనగర్ మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా నేడు జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో డిసిసి కార్యాలయంతో పాటు నగరంలోని శాతవాహన యూనివర్సిటీ మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం వద్ద కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. మొదట డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. అనంతరం నగరంలోని శాతవాహన యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్ హాజరై జ్యోతిభా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యులు అంజన్ కుమార్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ మాట్లాడుతూ కుల వివక్ష నిరక్షరాస్యత సతీసహగమనం పై ప్రజలను జాగృతం చేసి మహాత్మా అయినా జ్యోతిబాపూలే వర్ధంతి సందర్భంగా వారిని స్మరించుకొని ఘన నివాళులు అర్పించడం జరిగింది, 18వ శతాబ్దంలో ఈ దేశ రూప్ రేఖలను మార్చిన మహనీయుడు, విద్య నేర్చుకోవడం ద్వారానే సమాజంలో కుల వివక్షను నిర్మూలించగలం అని నమ్మి తన సతీమణి సావిత్రిబాయి పూలేతో కలిసి ఎన్నో సమస్యలను ఎదుర్కొని దేశవ్యాప్తంగా చేపట్టిన




ఉద్యమం ద్వారా మహిళ లోకాన్ని అక్షరాస్యత వైపు నడిపించిన మహనీయుడు పూలే, అంబేద్కర్ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కు గురువుగా, అగ్రకులాల చేత అణిచివేతకు గురైన బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, సంఘసంస్కర్తగా తత్వవేత్తగా వారు చేసిన సేవలు మరువలేనివి, 1874 ఫిబ్రవరి 12 న శివాజీ సమాధిని వెలికి తీసి ఆయన జయంతి ఉత్సవాలను జరిపిన గొప్ప నాయకుడు జ్యోతిబా పూలే. కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఆయన చూపిన మార్గాన్ని అన్వేషిస్తూ వారి ఆలోచన విధానాలను ఆశయాలను కొనసాగిస్తుందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కులవివక్షను రూపుమాపడంలో విఫలమైందని, కుల మతతత్వ రాజకీయాల పట్ల అవలంబిస్తున్న విధానాలను మానుకోవాలని కోరుతున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు ఎండి తాజ్, శ్రావణ్ నాయక్ బానోతు, మడుపు మోహన్, పత్తి మధు, కర్ర రాజశేఖర్, కల్వల రామ్ చందర్,వెన్నం రజిత రెడ్డి, అహమ్మద్ అలీ, కుర్ర పోచయ్య, వంగల విద్యాసాగర్, తోట అంజయ్య, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, పెద్ది గారి తిరుపతి,రోళ్ళ సతీష్, గంగుల దిలీప్, ఇమ్రాన్, నాగుల సతీష్, కుంబాల రాజ్ కుమార్, వీర దేవేందర్, విక్టర్, హైమద్, రామిడి తిరుపతి, నూనె గోపాల్ రెడ్డి, మంద మహేష్, మాదాసు శ్రీనివాస్, అనరాస్ కుమార్, బాశెట్టి కిషన్, పర్వత మల్లేశం, నూనె గోపాల్ రెడ్డి, సరిల్ల రతన్ రాజ్, మీసా రమాదేవి, దుబ్బ నీరజ, రవీందర్ రెడ్డి, ఉరడి లతా, ఆవారు లత, రాచర్ల పద్మ, స్వప్న శ్రీ,విక్రమ్, బషీరుద్దీన్, సుధాకర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికల్లో
# కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజల మద్దతు

- అది చూసి ఓర్వలేక ప్రశాంత్ రెడ్డి అబద్ధపు మాటలు
- రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి

**భీంగల్ నవంబర్ 28(ప్రజాస్వరం):**

భీంగల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు మొదలైనప్పటి నుండి స్థానిక శాసనసభ్యులు ప్రశాంత్ రెడ్డి తమకు గ్రామాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు లేక పోవడంతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధపు మాటలు మాట్లాడుతున్నాడని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చీరాల పంపిణీ,వడ్డీ లేని రుణాలు ఇస్తున్న సందర్భంలో ఇప్పటికే అయోమయంలో ఉన్న ప్రశాంత్ రెడ్డి అవి కేవలం ఎన్నికల కోసమే ఇస్తున్నారని అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని, గతంలో మంత్రిగా చేసిన ప్రశాంత్ రెడ్డికి ఏమి చేయాలో తెలియని స్థితిలో ఉన్నాడ అని మానాల మోహన్ రెడ్డి అన్నారు. గతంలో 9 సంవత్సరాలు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ పార్టీ ఏ రోజు కూడా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణాలకు వడ్డీ మాఫీ చేయలేదని, మాఫీ చేయాలనే ఆలోచన కూడా వారికి రాలేదని, కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి కోటి మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తుంటే కేవలం ఎన్నికల కోసమే ఇస్తున్నారని తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని, గత మూడు నెలల క్రితం కూడా వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరిగిందని అప్పుడు ఎన్నికలు లేవని, మేము ఎప్పుడు ఇస్తున్నాము కాదు మీరు 9 సంవత్సరాల లో ఎందుకు రుణాలు మాఫీ చేయలేదు? ఒక్కసారి ఆత్మ శుద్ధి చేసుకోవాలని మానాల మోహన్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన ఇందిరమ్మ చీరలను ఆడపడుచులు గ్రామాల్లో కట్టుకొని మురిసిపోతున్నారని కానీ గతంలో టిఆర్ఎస్ సమయంలో ఇచ్చిన బతుకమ్మ చీరలు నాణ్యత లోపంతో ఇవ్వడం ద్వారా రోడ్ల పైన కాలబెట్టిన సందర్భాలు ఉన్నాయని రైతులు తమ పోలాలకు పిట్టల కాపలాకు వాడిన సందర్భాలు ఉన్నాయని, ఏ రోజు కూడా టిఆర్ఎస్ సమయంలో ఇచ్చిన బతుకమ్మ చీరలను మహిళలు బతుకమ్మ రోజు కట్టుకోలేదని, అంత నాణ్యత లోపంతో టీఆర్ఎస్ చీరలు పంపిణీ చేయడం జరిగిందని మానాల మోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజాపాలనను ఓర్వలేకనే ప్రశాంత్ రెడ్డి తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో అందిస్తున్న ప్రజా పాలన ద్వారా జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలో సర్పంచులు,వార్డ్ మెంబర్లు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే గెలిచే అవకాశాలు ఉన్నాయని గ్రహించిన ప్రశాంత్ రెడ్డి దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. ప్రశాంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడడం మానుకోకపోతే ఖచ్చితంగా స్థానిక సంస్థల్లో ప్రజలు ప్రశాంత్ రెడ్డికి బుద్ధి చెప్పడం జరుగుతుంది . బాల్కొండలో ప్రశాంత్ రెడ్డి హైదరాబాద్ లో కేటీఆర్ అధికారం పోవడంతో మతిస్థిమితం కోల్పోయి అబద్ధపు మాటలు మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. జిల్లా ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని ప్రజలకు సంక్షేమ పథకాలు,అభివృద్ధిని అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరింత బలం చేకూర్చే విధంగా ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులను అధిక మెజారిటీతో గెలిపించాలని మానాల మోహన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో భీంగల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు జెజె నర్సయ్య,జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కుంట రమేష్,గోపాల్ నాయక్, అన్వేష్, వాక మహేష్, దొన్ కంటి రాజేష్, నాగభూషణం, శ్యామ్ రాజ్, సాయి బాబా, నవీన్, పల్లికొండ అశోక్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





## కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేసిన
# ఎమ్మెల్యే గంగుల కమలాకర్

**కరీంనగర్, నవంబర్ 28(ప్రజాస్వరం):**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామ శివారులోని మానేరు నది పైనగల చెక్ డ్యాం ఇటీవల కూలిపోయిన నేపథ్యంలో కూల్చివేత ఘటన పై జ్యుడిషియల్ ఎంక్వైరీ జరిపించాలని జిల్లా కలెక్టర్ పమేల సత్పతి కి వినతి పత్రాన్ని అందజేసిన మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, వీరి వెంట హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీవి రామకృష్ణ, నగర అధ్యక్షులు చల్ల హరిశంకర్, మాజీ కార్పొరేటర్ లు ఐలెందర్ యాదవ్, ఎడ్ల అశోక్, జంగిలి సాగర్, దుర్శేడ్ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు, నాయకులు కర్ర సూర్య శేఖర్, నేతి రవి వర్మ, మీడిదొడ్డి నవీన్, వోడ్నాల రాజు , పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, చేతి చంద్రశేఖర్, రాజు, ఆరె రవి, నాయకురాలు గంటల రేణుక .. పలువురు బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి: పట్నం అవినాష్ రెడ్డి

**షాబాద్,నవంబర్ 28(ప్రజాస్వరం):**

గ్రామపంచాయతీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో మండలంలోని కేశవ గూడ, హైతాబాద్, గొల్లూరుగూడ, సీతారాంపురం, లక్ష్మారావు గూడ, సర్దార్ నగర్, బోడం పహాడ్, తిర్మలాపురం తదితర గ్రామాలకు చెందిన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయబోయే ఆశావాహులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి మాట్లాడుతూ... సర్పంచ్ లతో పాటు పంచాయతీ పాలకవర్గం గ్రామాల పురోగతికి పాటుపడేలా ఉండాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రజలకు అందే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు వాటి ఫలాలు ప్రజలకు, పంచాయతీలకు సకాలంలో అందే విధంగా ఉండేవారే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆయన సూచించారు. పంచాయతీ ఎన్నికలు వీలైనంత వరకు సజావుగా, మంచిగా జరిగేట్లు చూడాలని ప్రజలను ప్రలోభ పెట్టే విధంగా ఉండరాదని, అలాంటి నాయకత్వంతో రాజకీయాలతో పాటు గ్రామీణ వాతావరణం కలుషితం అవుతుందని తెలిపారు. వివిధ పార్టీలకు చెందిన పలువురు అవినాష్ రెడ్డి నాయకత్వంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి అవినాష్ రెడ్డి ఆ ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నర్సింగ్ రావు సీనియర్ నాయకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు స్వప్న నరసింహారెడ్డి, నక్క శ్రీనివాస్ గౌడ్, సహకార సంఘం చైర్మన్ చల్లా శేఖర్ రెడ్డి, రమేష్ యాదవ్, కారు చెన్నయ్య,చాన్ పాషా, దర్శన్, భూపాల్ రెడ్డి, పాండురంగ రెడ్డి, రాజేందర్ రెడ్డి, నర్సింలు, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహారెడ్డి, మల్రెడ్డి, లక్ష్మయ్య, దర్శన్, రాంచంద్రారెడ్డి, యాదవరెడ్డి, వాసుదేవ్ రెడ్డి, సందీప్, మంగలి రాజు,నరేందర్ రెడ్డి,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ రంగ ప్రవేశానికి ఎదురుచూస్తున్న యువత.

- **నా ఊరు నా గ్రామ అభివృద్ధి అంటూ ముందుకు సాగునున్న యువత..**

**అశ్వారావుపేట నవంబర్ 28(ప్రజాస్వరం):**

రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత రంగ ప్రవేశానికి అన్ని విధాలుగా సంసిద్ధంగా తయారవుతున్నారు. నా గ్రామం నా ఊరు అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగాలి అనే సిద్ధాంతంతో రాజకీయ రణరంగం బరిలో నిలవాలి అనే దృడ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో యువత మొత్తం రహస్య మంతనాలు జరుపుతూ వార్డు మెంబర్ నుంచి అన్ని స్థానాల్లో తమకు అనుగుణంగా ప్రజల్లో మమేకమైన అభ్యర్థిని నిలబెట్టాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఏ అభ్యర్థులను నిలబెడతారు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ ఏ అభ్యర్థులను నిలబెడతారో వేచి చూడాలి. ఈ క్రమంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పిలిస్తే పలికే నాయకుడు కోసం ప్రజలు వేచి చూస్తున్నారు. అనే ఒక నినాదంతో యువత రాజకీయ రంగ ప్రవేశానికి గ్రామ అభివృద్ధి కొరకై రాజకీయ రంగ ప్రవేశానికి సుముకుత చూపుతూ యువత రాజకీయాల్లో రాణించాలి అని పలువురు తెలిపిన మాటలతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలబడాలనే దృడ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.



# రామన్నపేట భవిత సెంటర్ లో లీగల్ ఎయిడ్ క్లినిక్ : బత్తుల గణేష్

**వలిగొండ, నవంబర్ 28(ప్రజాస్వరం):**


యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని భవిత సాహిత్య విద్య వనరుల కేంద్రంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ యాదాద్రి భువనగిరి జిల్లా అదేశాలనుసారం మనొన్యాయ్ కార్యక్రమంలో భాగంగా లీగల్ వాలంటీర్ లు బత్తుల గణేష్ హాజరై లీగల్ ఎయిడ్ క్లినిక్ ను సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులకి కల్పించే వసతులు, సౌకర్యాలు, మౌలిక సదుపాయాల పరిశీలించి, విద్యార్థులకి, రిసోర్స్ పర్సన్ తో చర్చించి, లీగల్ సెల్ ఉపయోగాలు తెలిపారు. అక్కడ విద్యార్థులకి ఉన్న సదరం సర్టిఫికెట్, రెన్యువల్ మరియు పెన్షన్ సంబంధించి ఉన్న సమస్యలు పరిష్కారం కోరారు. అనంతరం అక్కడి విద్యార్థులకి చేస్తున్న ఫిజియోథెరపీ సౌకర్యం ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ రిసోర్స్ పర్సన్ సుజాత, ఫిజియోథెరపీస్ట్ పవన్, విద్యార్థులు ఉన్నారు.




# జ్యోతిబా పూలేకు ఘన నివాళి

**రాజేంద్రనగర్ నవంబర్ 28(ప్రజాస్వరం):**

రాజేంద్రనగర్ ప్రభుత్వ కళాశాల పరిధిలో గల మహాత్మా జ్యోతి రావు పూలే విగ్రహానికి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా స్మరిచుకోవడం జరిగింది. శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ సంఘ సంస్కర్త సామాజిక అంశాలపై తన కలంతో గులాం గిరి రాసి మహాయుధమే నడిపిన మహాత్ముడు సత్యా శోధక సమాజం ద్వారా తన సర్వస్వం సమాజ అభ్యున్నతికి కోసమే దార పోషణ యుగపురుషుడు త్యాగశీలి మహాత్మ జ్యోతిరావు పూలే మానవాళి చేత మహాత్ముడు అని పిలుచుకున్న మహానీయుడు పాఠశాలలో బందిగా ఉన్న అక్షరాన్ని అందరికీ అందించిన మహోన్నతుడు మహిళా హక్కులు కూడా మానవ హక్కులేనని నినాదించి తన పోరాటంలో భార్యను భాగస్వామం చేసి సమాజం కోసమే పని చేసిన సమానత్వపు యోధుడు సామాన్యుల వేతలను సమాజానికి చూపి మహానాయకుడు జ్యోతిరావు పూలే అనేక సంఘర్షణలతో కూడిన నేటి సమాజానికి ఒక ఆశయ రూపంగా నిలిచిన మహానీయుడు అన్యాయాలను అధిపత్యాన్ని ఎదిరించి అడుగు వర్గాలను అక్కున చేర్చుకొని అక్షర యుద్ధం నడిపిన మహాత్ముడు మన మహాత్ముడా అందుకో మా ఉద్యమ జోహార్లు వారు చూపిన మార్గంలో నడుస్తాం మీరు కలలుగన్న సమాజం నిర్మాణ కోసం శ్రమిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు వనం నర్సింహా మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు క్యాసారం శంకర్రావు మాదిగ, మహాత్మా జ్యోతి పూలే విగ్రహ వ్యవస్థాపకులు ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పోతురాజు యాదయ్య మాదిగ, జిల్లా నాయకులు నాన్నగారి. రాంచేందర్ మాదిగ, జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎడ్లకాడి సూర్యం, నావజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు మంగళవారం శ్రీనివాస్, సీనియర్ నాయకులు డాక్టర్ వి శ్రీరాములు, జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు పలుగుచెర్వు మహేష్, నవీన్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



# పంచాయతీ ఎన్నికల్లో ఒత్తిళ్లకు తావులేదు.

- **నిబంధనలు కఠినం చేస్తున్న ఎన్నికల అధికారులు**

**వనపర్తి, నవంబర్ 28(ప్రజాస్వరం):**

ఔవనపర్తి జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రశాంత వాతావరణంలో జరగాలని ఎన్నికల పరిశీలకులు, జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన ఎన్నికల అధికారులు, నామినేషన్ నుంచి వ్యయ లెక్కల వరకు పాటించాల్సిన నిబంధనలను వివరంగా తెలియజేశారు. జిల్లా ఎన్నికల అథారిటీ అధికారి ఆదర్శ్ సురభి మాట్లాడుతూ— "ఎవరినైనా నామినేషన్ వేయనీయకుండా అడ్డుకోవడం, బలవంతంగా ఉపసంహరణ చేయించడం ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన. అలాంటి ఘటనలు చోటుచేసుకుంటే కఠిన చర్యలు తప్పవు" అన్నారు. ఉపసంహరణ తర్వాత ఒక్క నామినేషన్ మాత్రమే మిగిలితే స్పెషల్ సెల్ ద్వారా సమగ్ర విచారణ జరుపుతామని తెలిపారు. ఉపసంహరణ చేసే అభ్యర్థులు "నాపై ఒత్తిడి లేదు, బలవంతం లేదు" అనే ధృవీకరణ పత్రంపై సంతకం చేయాల్సిందేనని స్పష్టం చేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓటర్లను ఎలాంటి ప్రలోభాలకు గురి చేయకుండా, ప్రజలు ఎవరికీ నచ్చితే వారికి స్వేచ్ఛగా ఓటు వేసేలా వాతావరణం కల్పించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు యం. శ్రీనివాసులు కీలక సూచనలు చేస్తూ "నామినేషన్ వేయడానికి ముందు అభ్యర్థి కొత్త బ్యాంకు ఖాతా తప్పనిసరిగా తెరవాలి. ఎన్నికల వ్యయం మొత్తం ఈ ఖాతా ద్వారానే జరగాలి" అన్నారు. నామినేషన్ సమయంలో అందించే ఎక్స్పెండిచర్ బుక్‌లో ప్రతి ఖర్చును నమోదు చేయాలనీ, పక్షం పక్షం (15 రోజులకు) ఒకసారి మూడు సార్లు వ్యయ నోడల్ అధికారికి చూపించి సంతకం తీసుకోవాలని పేర్కొన్నారు. గెలిచినా, ఓడినా — పోటీ చేసిన ప్రతి అభ్యర్థి 45 రోజులలోపు బిల్లులు, వౌచర్లతో సహా పూర్తి లెక్క ఇవ్వడం తప్పనిసరి. లెక్కలు సమర్పించని పక్షంలో గెలిచినవారిని అనర్హులుగా ప్రకటిస్తారు. ఓడినవారిని తదుపరి ఎన్నికల నుంచి బ్లాక్‌లిస్ట్ చేస్తారు. అని హెచ్చరించారు. జనాభా ఆధారంగా వ్యయ పరిమితులు ఇలా ఉన్నాయని వివరించారు. 5000 కంటే ఎక్కువ జనాభా ఉన్న పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి: ₹2.5 లక్షలు అల్ప జనాభా పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి: ₹1.5 లక్షలు వార్డు మెంబర్ (జనాభా >5000): ₹50,000 వార్డు మెంబర్ (జనాభా <5000): ₹30,000 అభ్యర్థులు ₹5,000 లోపు ఖర్చులను నగదుగా, అంతకంటే ఎక్కువ మొత్తాలను చెక్కు/డీడీ లావాదేవీల రూపంలోనే చేయాలని సూచించారు. సమావేశంలో డివిజనల్ పంచాయతీ అధికారి రఘుపతి రెడ్డి, రాజకీయ ప్రతినిధులు బి ఆర్ఎస్ నుంచి సయ్యద్ జమీల్ బీజేపీ పెద్దిరాజు, ఏఐఎంఐఎం ఎం.ఏ. రహీం, టిడిపి బాలరాజు, బీఎస్పీ ఎల్లస్వామి, కాంగ్రెస్ రాజేందర్, సిపిఎం పరమేశ్వర చారి, తదితరులు పాల్గొన్నారు.




# నవంబర్ 29 దీక్షా దివాస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి.

**వలిగొండ నవంబర్ 28(ప్రజాస్వరం):**

యదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులకు ప్రజాప్రతినిధులకు కార్యకర్తలకు నవంబర్ 29 శనివారం ఉదయం 10:30 నిమిషాలకు భువనగిరి పట్టణ కేంద్రంలోని రైతుబజార్ (ప్రిన్స్ కార్నర్) చౌరస్తా వద్ద దీక్ష దివాస్ కార్యక్రమం కలదు.కావున వలిగొండ మండలంలోని రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు అన్ని గ్రామాల నుండి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని భువనగిరి మాజీ శాసనసభ్యులు పైల శేఖర్ రెడ్డి భువనగిరి పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.



# ఘనంగా మహాత్మా జ్యోతిబాపూలే 135 వ వర్ధంతి

- **మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి ఆనంద్ మాదిగ**

**వికారాబాద్ నవంబర్ 28(ప్రజాస్వరం):**



శుక్రవారం స్థానిక వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు పి ఆనంద్ మాదిగ మాట్లాడుతూ ప్రపంచంలోకెల్లా మొట్టమొదటి సంఘాల పితామహులు మహాత్మ బుద్ధుడు అయితే ఆయన వారసత్వాన్ని పొందిపుచ్చుకొని ఆయన ఆలోచన విధానాన్ని యావత్ భారతావానికి పరిచయం చేసిన మహాత్ముడు, సంఘ సంస్కర్త, ఈ దేశంలో ని శూద్రులకు అక్షరం నేర్పడం మొదలుపెట్టిన మహా గురువు, అంబేద్కర్ గురువు మహాత్మ జ్యోతిబాపూలే భారతదేశంలో రాచరిక వ్యవస్థను మరిచిపోయే విధంగా ప్రజాస్వామ్యానికి పునాదులు వేసే దిశగా ఆయన ఆలోచన విధానంతో ఎన్నో సంస్కరణలు ఈ దేశానికి అందించినటువంటి గొప్ప వ్యక్తి మహాత్మ జ్యోతి బాపూలే ఆయన వల్లే ఈ దేశంలోని శూద్రులు, బడుగు బలహీన, వర్గాలు అక్షరం నేర్చుకోవడానికి అవకాశం దొరికింది అని మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బొంపల్లి వెంకటేష్, బొంపల్లి గ్రామ అధ్యక్షులు మల్లేష్, టి శ్రీనివాస్, కొనగల నర్సింలు, ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు బలమైన మద్దతు 2050 నోట్ పుస్తకాల కానుక

**షాబాద్ నవంబర్ 28(ప్రజాస్వరం):**

సి.ఎస్.ఆర్.ఎమ్.సీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్, నీడ్ సంస్థ సహకారంతో సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్. గీత, తోమాస్ రెడ్డి చిత్తా దంపతుల ఆధ్వర్యంలో వారి ప్రతినిధి టీ. శ్రీను షాబాద్ లోని హోలీ స్పిరిట్ హై స్కూల్ లో చదువుతున్న బాల బాలికలకు 2050 నోటు పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని పేద పిల్లలకు సహాయ సహకారం అందించాలనే ఉద్దేశంతో ఈ నోటు పుస్తకాల పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరై సంస్థ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.




# వరి కొనుగోలు కేంద్రాల్లో ఎఫ్ఏక్యూ ఖచ్చితంగా అమలు చేయాలి.

- **అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్**

**వనపర్తి, నవంబర్ 28 (ప్రజాస్వరం):**

వరి ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి రాజీకి తావులేదని, ఎఫ్ఏక్యూ (ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ) ప్రమాణాల ప్రకారం మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాల్సిందిగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ స్పష్టం చేశారు. శుక్రవారం పానుగల్ మండల పరిధిలోని ఐకెపి వరి కొనుగోలు కేంద్రం, వ్యవసాయ మార్కెట్ కమిటీ గోదాంలను ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అన్ని రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలని, ముందుగా చేరిన రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా సంబంధిత ట్యాగ్ చేసిన మిల్లులకు వెంటనే తరలించాలని సూచించారు. తరువాత కొత్తపేట గోదాంను పరిశీలించిన ఆయన, సీఎంఆర్ (సీఎంఆర్) కింద మిల్లుల నుంచి డెలివరీ అయిన బియ్యం నిల్వలపై సమగ్రంగా విచారణ చేశారు. నిల్వ విధానాలు, నాణ్యత ప్రమాణాలపై అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చారు. అంతకుముందు పానుగల్లు ఏఎంసీ గోదాంను సందర్శించిన అదనపు కలెక్టర్, తాజాగా కొనుగోలు చేసిన వరి నిల్వకు అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశం గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో పానుగల్ తహసీల్దార్, జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, డీఎం జగన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# ముంబై ఇండియన్స్ మహిళా జట్టులో కీసర యువతి నల్లకీర్తి రెడ్డి

**కీసర నవంబర్ 29(ప్రజాస్వరం):**

మేడ్చల్ జిల్లా కీసర ప్రాంతానికి చెందిన యువ క్రికెటర్ నల్ల కీర్తి రెడ్డి ముంబై ఇండియన్స్ ఉమెన్స్ క్రికెట్ టీంలో చోటు దక్కించుకుని ప్రతిభ చాటింది. చిన్న వయసులోనే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్న కీర్తి, స్థానిక గ్రౌండ్లలో సాధనతో మొదలైన ఆమె ప్రయాణం రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో మెరుగైన ప్రదర్శనలతో ముందుకు సాగింది. కీర్తి బ్యాటింగ్‌లో ఆత్మవిశ్వాసం, బౌలింగ్‌లో శ్రద్ధ, ఫీల్డింగ్‌లో చురుకుదనం ప్రదర్శిస్తూ సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించింది. తాజాగా జరిగిన ఎంపికల్లో అద్భుత ప్రతిభ కనబరచడంతో ముంబై ఇండియన్స్ టీమ్ ఆమెను ఎంపిక చేసింది. కీర్తి విజయంతో ఆమె తల్లిదండ్రులు నల్ల రామకృష్ణారెడ్డి, రాణి ఉప్పొంగి పోతున్నారు. కీసర ప్రాంత ప్రజలు, స్థానిక క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాంతీయ కోచ్‌లు, క్రికెట్ ప్రేమికులు కీర్తి మరిన్ని ఉన్నత స్థాయిల్లో రాణించాలని శుభాకాంక్షలు తెలిపారు.



ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
29.11.2025
శనివారం | హైదరాబాద్
www.prajaswaramdaily.com


# హైడ్రా అంటేనే ఓ భరోసా

- **గ్రేటర్ ప్రజల విశ్వాసం నిలిచింది**
- **కుండపోత వానొచ్చినా నగరం సేఫ్**
- **టీమ్‌లకు హైడ్రా కమిషనర్ అభినందన**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:**

ఎంత వర్షం పడినా 'హైడ్రా' ఉందంటే చాలు గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు నిర్భయంగా, విశ్వాసంతో ఉన్నారని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. భారీ వర్షాలు పడినా వరదలు ముంచెత్తకుండా పకడ్బందీగా వరద నివారణ చర్యలు చేపట్టి హైడ్రా మరోసారి ప్రజల పట్ల తన బాధ్యతను నిర్వర్తించి వారి నమ్మకాన్ని పొందిందని ఆయన పేర్కొన్నారు. మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌ల కాలపరిమితి 150 రోజులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం జలవిహార్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు. క్యాచ్‌పిట్లు, కల్వర్టులతో పాటు నాలాల్లో పూడిక తీసి వరద సాఫీగా సాగేలా కృషి చేసిన మాన్సూన్ ఎమర్జెన్సీ, డిజాస్టర్ టీమ్‌లను ఆయన అభినందించారు. 'ఐదు నెలల క్రితం ఇక్కడే సమావేశమై మాన్సూన్ విధుల గురించి వివరించాము. మీరు నిర్దేశించిన దానికంటే ఎక్కువ పని చేసి హైడ్రాతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చారు' అని ప్రశంసించారు. కుండపోత వాన కురిసినా, క్లౌడ్‌బరస్ట్‌లు సంభవించి ఒకే రోజు 10 నుంచి 18 సెంటీమీటర్ల వర్షం పడిన సందర్భాలు ఉన్నప్పటికీ, మెట్ టీమ్‌లు నిబద్ధతతో పని చేయడం వల్లే నగర ప్రజలు వరద భయం లేకుండా ప్రయాణాలు సాగించారని ఆయన కొనియాడారు.

**వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యత**

హైడ్రాలో భాగమైన డిజాస్టర్ రెస్పాన్స్ సిబ్బంది, ఎస్ఎఫ్‌వోలు, మార్షల్స్‌తో కలిసి మెట్ టీమ్‌లు సుమారు 3వేల లారీల పూడికను నాలాల నుంచి తొలగించాయని కమిషనర్ గుర్తు చేశారు. కేవలం పనికే పరిమితం కాకుండా, సిబ్బంది ఉన్నత శిఖరాలకు ఎదిగేలా వ్యక్తిత్వ వికాసానికి కూడా హైడ్రా ప్రయత్నించిందని, ఇందులో భాగంగా ఆర్థిక క్రమశిక్షణ, సరైన జీవన విధానాలను అలవర్చుకునే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థిక వికాస నిపుణులు వంగా రాజేంద్రప్రసాద్, ఎం. నర్సింగ్, చిల్లంచెట్టి గణేష్‌లను ఆయన సన్మానించారు. మరోవైపు, మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లలో ఉత్తమ విధులు నిర్వర్తించిన 30 మందికి ప్రశంసాపత్రం, బహుమతిని కమిషనర్ అందజేశారు. ఈ ఏడాది ఎంతో అనుభవం గడించామని, ఈ అనుభవం వచ్చే ఏడాది మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు దోహదం చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. అమీర్‌పేటలో నాలాల్లో పూడిక తీసి, ప్యాట్నీ నాలా ఆక్రమణలు తొలగించడం ద్వారా 25 కాలనీలకు వరద ముప్పు తప్పించామని ఆయన గుర్తు చేశారు. హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు, ఎస్ఎఫ్‌వోలు పని చేసిన తీరును హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య వివరించగా, పొదుపు ఆవశ్యకత, ఆరోగ్య పరిరక్షణ గురించి హైడ్రా అడ్మిన్ ఎస్పీ ఆర్. సుదర్శన్ సూచనలు చేశారు.



# ఎమ్మెల్యే మేఘారెడ్డి మార్క్!

- **నాడు నమ్మి వచ్చిన వారికే నేడు టికెట్లు.**
- **ఆయనను గెలిపించిన వారిని.. తాను గెలిపించే ప్రయత్నాలు ముమ్మరం.**

**వనపర్తి ప్రతినిధి నవంబర్ 28(ప్రజాస్వరం):**

వనపర్తి నియోజకవర్గంలో 2023 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపుకు పనిచేసిన నాయకులపై ఎమ్మెల్యే మేఘారెడ్డి పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో విజయం సాధించిన రోజే నవంబర్ 30 వరకు తన వెంట ఉన్న అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలకే స్థానిక సంస్థల ఎన్నికలలో అవకాశం కల్పిస్తానని బాహాటంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో వనపర్తి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలు రావడంతో ఎమ్మెల్యే వెంట ముందు నుంచి నడిచిన వారికే అవకాశం కల్పిస్తారనే ప్రచారం సాగుతున్న నేపథ్యంలో మేఘారెడ్డి గెలుపునకు కృషిచేసిన వారంతా స్థానిక సంస్థల్లో తమ ప్రాతినిధ్యం నిలబెట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. మేఘారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయన రాజకీయ చతురతపై అవగాహన లేని కొందరు నాయకులు అటు ఇటు గ్రూపులు మారుస్తూ ఇష్టానుసారంగా వ్యవహరించిన నాయకులు సైతం స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్యేకు దగ్గరయ్యేందుకు పడరాని పాట్లు పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ మొదటి నుంచి మేఘారెడ్డి వెంట ఉన్న నాయకులతో పాటుగా ఎమ్మెల్యే నిశితంగా పరిశీలిస్తుండడంతో ఎక్కడికక్కడ ఏ ఎండకు ఆ గొడుగు పట్టేవారికి చెక్ పెట్టేందుకు వ్యూహాత్మకంగానే ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వనపర్తి నియోజకవర్గంలోని ఓ నాయకుడు సమయానుకూలంగా ప్లేటు ఫిరాయిస్తూ రాజకీయాలు చేస్తూ వస్తున్నాడనే అపవాదు మూటగట్టుకున్నాడు. ఇదే క్రమంలో తన స్వగ్రామమైన మండల కేంద్రం సర్పంచ్ పదవి జనరల్ కావడంతో స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు మేఘారెడ్డి ప్రభావం తప్పితే తాను నమ్మిన నాయకుడి ప్రభావం ఉండదనే ఆలోచనతో ఇటీవల ఎమ్మెల్యేకు దగ్గరయ్యేందుకు శతవిధాల ప్రయత్నాలు చేస్తుండడంతో ఆ పరిణామాలన్నిటిని మేఘారెడ్డి వెంట ఉన్న నాయకులు గమనిస్తూ వచ్చారు. సర్పంచ్ పదవికి మొదటి నుంచి పోటీలో ఉన్న వ్యక్తికి అనుకూలంగా పెద్ద ఎత్తున ఆ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశమై సదరు నాయకుడికి అవకాశం కల్పించకుండా మొదటి నుంచి ఉన్న తమకే అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేకు వివరించారు. స్వార్థ రాజకీయ అవకాశవాద కుప్పిగంతులను తాను కూడా సహించనని తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత విజయోత్సవ ర్యాలీలో భాగంగా రాజీవ్ చౌరస్తాలో వెల్లడించిన ఆనాటి మాట ప్రకారమే పార్టీలో ముందు నుంచి ఉన్న నాయకులకు అవకాశం ఇస్తానని తేల్చి చెప్పడంతో ఎమ్మెల్యే ఇచ్చిన మాట మేరకు వ్యవహరిస్తున్నారనే భావన కాంగ్రెస్‌లో చోటుచేసుకుంది.

**ఇచ్చిన మాటకు ఆదర్శ రాజకీయాలు**

**రాజకీయ నాయకులు సాధారణంగా ఏదైనా హామీ ఇచ్చినా, మాట ఇచ్చినా కాలక్రమంలో సునాయాసంగా వాటిని విస్మరిస్తుంటారు. కానీ ఎమ్మెల్యే మేఘారెడ్డి మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఆదర్శ రాజకీయాలకు అడుగులు వేస్తూ నమ్మినవారికి భరోసా కల్పిస్తున్నారు. ఎంపీపీ నుంచి అనూహ్యంగా ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన 2023 నవంబర్ 30 వరకు కాంగ్రెస్ పార్టీలో నమ్మకద్రోహం చేయకుండా కీలకంగా వ్యవహరించిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇవ్వడంలో ఏమాత్రం వెనకాడడం లేదు. ఇచ్చిన మాట కోసం హుందా రాజకీయాలు చేస్తున్న మేఘారెడ్డి భవిష్యత్తులో సింబల్ పై వచ్చే ఎన్నికలలోను ఇదే ఒరవడి కొనసాగిస్తారని ఆ పార్టీలోని నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో చర్చించుకుంటూ నాయకుడి మాటే శిరోధార్యం అంటూ కేరింతలు కొడుతూ రాజకీయ ఉత్సాహంలో మునిగిపోతుండడం ఎమ్మెల్యే మేఘారెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడుతున్నారనే అంశమే ప్రధానంగా మారింది.**





# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక... ఈవీఎంల తనిఖీ కోసం దరఖాస్తులేమీ రాలేదన్న ఎన్నికల సంఘం

- **నవంబర్ 14 నుంటి 21 వరకు ఎలాంటి దరఖాస్తు రాలేదన్న రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి**
- **మొదటి మూడు స్థానాల్లో ఉన్న అభ్యర్థులు కోరితే తనిఖీ చేయవచ్చన్న ఎన్నికల అధికారి**
- **ఫలితాలు ప్రకటించిన నాటి నుంచి ఏడు రోజుల్లో రాతపూర్వక దరఖాస్తు ఇవ్వాలని వెల్లడి**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఉపయోగించిన ఈవీఎంలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కీలక ప్రకటన చేశారు! ఈవీఎంల తనిఖీ కోసం ఒక్క దరఖాస్తు కూడా రాలేదని ఆయన తెలిపారు. ఉప ఎన్నిక ఫలితం ప్రకటించిన తర్వాత నవంబర్ 14 నుంచి 21వ తేదీ వరకు వారం రోజుల నిర్ణీత గడువులో ఎలాంటి దరఖాస్తు రాలేదని ఎన్నికల అధికారులు వెల్లడించారు.

ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం అత్యధిక ఓట్లు పొందిన అభ్యర్థి, ఆ తర్వాత రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థులు కోరితే మొత్తం ఈవీఎంలలో 5 శాతం వరకు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్ వీవీపాట్‌ల తయారీ సంస్థల ఇంజనీర్ల బృందం ద్వారా తనిఖీ చేసి ధృవీకరించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇందుకోసం ఫలితాల తేదీ నుంచి ఏడు రోజుల లోపు రాతపూర్వకంగా దరఖాస్తు చేయాల్సి ఉంటుందని వివరించారు.

ఎన్నికల నిర్వహణ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలు, నియమాలు, భద్రతా ప్రమాణాలతో పారదర్శకంగా జరిగినట్లు తెలిపారు. కాగా, దేశవ్యాప్తంగా వివిధ ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా వస్తున్న ఫలితాలపై కాంగ్రెస్ విమర్శలు గుప్పిస్తోంది. ఈవీఎం అక్రమాల కారణంగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ గెలుస్తోందని ఆరోపణలు చేస్తోంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంపై ఎలాంటి దరఖాస్తు రాలేదని ఎన్నికల అధికారి ప్రకటించారు.




# అర్ధరాత్రి వరకైనా కూర్చుంటాను

- **తన కోర్టులో లగ్జరీ వ్యాజ్యాలు ఉండవన్న సీజేఐ**
- **అలాంటి కేసులను సంపన్నులు వేస్తారని వ్యాఖ్య**
- **పేద కక్షిదారులకు న్యాయం తన తొలి ప్రాధాన్యత అని స్పష్టీకరణ**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:**

పేద కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడటం తన తొలి ప్రాధాన్యత అని, అవసరమైతే వారి కోసం అర్ధరాత్రి వరకు న్యాయస్థానంలో కూర్చుంటానని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. తిలక్ సింగ్ డాంగీ అనే వ్యక్తి కేంద్ర ప్రభుత్వంతో పాటు ఇతరులపై దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చిన సందర్భంగా సీజేఐ ఈ విధంగా స్పందించారు. తన కోర్టులో లగ్జరీ వ్యాజ్యాలు ఉండవని, ఇటువంటి కేసులను సంపన్నులు వేస్తారని సీజేఐ అన్నారు. "నేను మీకు ఒక విషయం చెప్పదలుచుకున్నాను. చివరి వరుసలో ఉండే పేదవారి కోసం నేను ఇక్కడ ఉన్నాను. అవసరమైతే వారి కోసం అర్ధరాత్రి వరకు ఇక్కడే కూర్చుంటాను" అని ఆయన వ్యాఖ్యానించారు. జస్టిస్ సూర్యకాంత్ భారత 53వ ప్రధాన న్యాయమూర్తిగా నవంబర్ 24న బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 15 నెలల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. 2027 ఫిబ్రవరి 9న సీజేఐగా పదవీ విరమణ చేయనున్నారు.






# హైదరాబాద్‌లో మరోసారి రికార్డు ధర... కోకాపేటలో ఎకరం రూ.150 కోట్లు

- **గండిపేట మండలం కోకాపేటలో ఎకరం భూమి రూ.151.25 కోట్లు**
- **నియోపొలిస్ లేఅవుట్ ప్లాట్ నెంబర్ 15, 16లో వేలం**
- **9.06 ఎకరాలను వేలం వేయగా సమకూరిన రూ.1,353 కోట్ల ఆదాయం**

**తెలంగాణ బ్యూరో, ప్రజాస్వరం:**

హైదరాబాద్ నగర శివారులోని కోకాపేటలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా జరిగిన వేలంలో ఎకరం భూమి ఏకంగా రూ.150 కోట్లకు పైగా పలికింది. గండిపేట మండలం పరిధిలోని కోకాపేటలో ఇటీవల భూముల ధరలు రికార్డు స్థాయిలో నమోదవుతున్నాయి. హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో కోకాపేట నియోపొలిస్ లేఅవుట్‌లో నిర్వహించిన ఈవేలంలో ఎకరం భూమి ధర రూ.151.25 కోట్లకు చేరింది.

నియోపొలిస్‌లోని ప్లాట్ నెంబర్ 15, 16లలోని 9.06 ఎకరాలను ప్రభుత్వం వేలం వేయగా రూ.1,353 కోట్ల ఆదాయం లభించింది. గతంలో ప్లాట్ నెంబర్ 17, 18లను వేలం వేయగా ఎకరం రూ.137.25 కోట్లు పలికింది. అంతకుముందు టీజీఐఐసీ భూముల్లో ఎకరా ధర రూ.177 కోట్లుగా నమోదైన విషయం విదితమే. నియోపొలిస్‌లో 2023లో ఎకరా భూమి సగటున రూ.73 కోట్లు పలికింది. ఇప్పుడు ఆ ధర దాదాపు రెండింతలు పెరిగింది

# సొంత ఫోన్లతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల చలాన్లు..

- **హైదరాబాద్ ట్రాఫిక్ చలాన్ల విధానంపై హైకోర్టులో విచారణ**
- **నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి ఆదేశం**

**తెలంగాణ బ్యూరో, :**

హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ పోలీసులు జారీ చేస్తున్న చలాన్ల విధానంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పోలీసులు తమ సొంత మొబైల్ ఫోన్లతో వాహనదారుల ఫొటోలు తీసి చలాన్లు వేయడాన్ని తప్పుబడుతూ దాఖలైన పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర హోంశాఖకు నోటీసులు జారీ చేసింది. రాఘవేంద్ర చారి అనే వ్యక్తి ఈ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులు తన వాహనానికి మూడుసార్లు సొంత ఫోన్లతో ఫొటోలు తీసి చలాన్లు పంపారని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం, ట్రాఫిక్ చలాన్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ విధానంపై పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది.ఇదిలా ఉండగా, ట్రాఫిక్ ఉల్లంఘనల చలాన్లపై ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపైనా హైకోర్టు రెండు రోజుల క్రితం కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఇలాంటి రాయితీల వల్ల చట్టంపై ప్రజల్లో భయం పోతుందని, క్రమశిక్షణారాహిత్యం పెరుగుతుందని అభిప్రాయపడింది. ఈచలానా వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు తీసుకున్న చర్యలేంటో తెలపాలని కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది. తాజా పిటిషన్‌పై తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం డిసెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999